ప్రజాశక్తి

ఆదివారం 4 జనవరి 2026   8 పేజీలు

ఎన్‌టిఆర్   కృష్ణా

అమెరికా చర్యపై నిరసన

● వెనిజులా అధ్యక్షుడిని విడుదల చేయాలని సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - ఉంగుటూరు (హనుమాన్‌జంక్షన్) : వెనిజులా అధ్యక్షుడు నికోలాస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను అమెరికా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రాత్రి నిరసన కార్యక్రమం చేపట్టారు. సిపిఎం బాపులపాడు మండల కమిటీ ఆధ్వర్యాన కృష్ణాజిల్లా హనుమాన్‌జంక్షన్లో ఈ కార్యక్రమం జరిగింది. కొవ్వొత్తులు, ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం బాపులపాడు మండల కార్యదర్శి బేతా శ్రీనివాసరావు మాట్లాడుతూ వెనిజులాపై అమెరికా దాడిచేసి ఆ దేశ అధ్యక్షుడిని, ఆయన భార్యను కిడ్నాప్ చేసి తీసుకెళ్లడం దుర్మార్గపు చర్యని అన్నారు. వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు నల్లి ఆంజనేయులు, కొత్తూరు కిషోర్, అబ్దుల్ బారి, రాజనాల సురేష్, తోట కోటేశ్వరరావు, మారేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్లో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు బేతా శ్రీనివాసరావు తదితరులు

వెనిజులాపై దాడికి వ్యతిరేకంగా నేడు సిపిఎం నిరసన

ప్రజాశక్తి - విజయవాడ : వెనిజులాపై అమెరికా దురహంకార, దురాక్రమణ దాడికి వ్యతిరేకంగా ఆదివారం ఉదయం 10.30 గంటలకు సిపిఎం ఆధ్వర్యాన విజయవాడ బీసెంట్ రోడ్డు మహంతి మార్కెట్ (అన్సారి పార్క్) వద్ద నిరసన ప్రదర్శన జరుగుతుంది. ఆదేశంపై దాడి చేయడమే కాకుండా అధ్యక్షుడు మదురోని, ఆయన భార్యను నిర్బంధించి తీసుకెళ్లిన అమెరికా సామ్రాజ్యవాదం నశించాలని, తక్షణం వారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొంటారు.

గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన మారిషస్ అధ్యక్షుడు ధరంబీర్ గోకుల్ జిసిఎస్‌కెకు స్వాగతం పలుకుతున్న మంత్రి కందుల దుర్గేష్

నూతన పింఛన్లేవీ ?

● దరఖాస్తులు బుట్టదాఖలు ● 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'ల్లో పరిష్కారం శూన్యం

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

అర్హులైన ప్రతి ఒక్కరికీ మెరుగైన సామాజిక భద్రత కల్పించేందుకు వివిధ తరగతులకు సామాజిక పింఛన్ నగదు పెంచామని చెబుతున్న ప్రభుత్వం నూతన పింఛన్ల మంజూరును నిర్లక్ష్యం చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 19 నెలలుగా నూతన పింఛన్ ఒక్కటీ మంజూరు చేయలేదు. దీంతో సమాజంలో వృద్ధులు, వివిధ వ్యాధులతో మంచాలకే పరిమితమవుతున్న వారు అధికమైనా పింఛన్ల సంఖ్య కుందించుకుపోతున్నాయి. ఈ క్రమంలోనే 2023 జులైలో సామాజిక పింఛన్ల సంఖ్య కంటే 2025 నవంబర్ నాటి పింఛన్ల సంఖ్య తగ్గిపోయింది. ఈనేపథ్యంలోనే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పింఛన్ల మంజూరు చేయాలని పలువురు వేడుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి 19 నెలల కాలంలో 750 మందికిపైగా సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. 26 మండల కేంద్రాల్లో సమర్పించిన వినతులు దీనికి అనేక రెట్లు అధికంగా ఉంటాయి. వీల్ చైర్‌లో వచ్చి మరీ జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో పింఛన్ల కోసం వినతులు అందిస్తున్నారు. వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, మత్స్యకారులు, కల్లుగీత, చేనేత కార్మికులు, సాంప్రదాయ చెప్పులు కుట్టేవారు, డప్పు కళాకారులు, హిజ్రాలు, ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులకు నెలకు రూ.4 వేల చొప్పున కిడ్నీ వ్యాధిగ్రస్తులు, బోధకాలతో బాధపడే వారికి నెలకు రూ.10 వేలు, పక్షవాతం, ఇతర వ్యాధులతో వీల్ చైర్‌కు పరిమితమైన వారికి నెలకు రూ.15 వేల చొప్పున ప్రభుత్వం ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు అందిస్తోంది. సామాజిక పింఛన్లు పేద కుటుంబాలకు ఎంతో ఆసరాగా ఉంటున్నాయి. 2025 నవంబర్‌లో కృష్ణాజిల్లాలో మొత్తం 2,35,154 మందికి సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. 2023లో సామాజిక పింఛన్లు అందుకున్నవారి సంఖ్య 2,35,413గా ఉంది. 2023 నాటికన్నా 2025 చివరి నాటికి 259 తక్కువ మంది ఉన్నారు. వృద్ధాప్యం, అనారోగ్యాల కారణంగా చనిపోయిన వారి స్థానంలో కొత్తవారికి ఇవ్వకపోవడంతో సంఖ్య తగ్గిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించకపోవడంతో పింఛన్లు సంఖ్య తగ్గుతూ వచ్చింది. సమాజంలో అత్యంత నిస్సహాయ స్థితిలో ఉన్నవారికి ప్రభుత్వ పింఛను ఆర్థిక సాయం మాత్రమే కాదు. అది వారి ఆత్మగౌరవానికి ప్రతీకగా ఉంటుంది. వృద్ధాప్యం, వైకల్యం, అనారోగ్యంతో బాధపడే వారికి కుటుంబంలో ఇతరులకు తాము భారంగాలేమని పింఛన్ భరోసా ఇస్తుంది. ఈ క్రమంలోనే అర్హులైన వారికి నూతన పింఛన్లు మంజూరు చేయకపోవడంతో పలువురు ఆందోళన చెందుతున్నారు. అర్హులైన వారందరికీ సామాజిక పింఛన్ల మంజూరుకు చర్యలు తీసుకోవాలని పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మారిషస్ అధ్యక్షుడికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - గన్నవరం (ఉంగుటూరు) : ఈనెల 3 నుంచి 8 తేదీ వరకు ఆరు రోజులపాటు భారతదేశ పర్యటనలో భాగంగా శనివారం గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన మారిషస్ అధ్యక్షులు ధరంబీర్ గోకుల్ జిసిఎస్‌కెకు రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఘన స్వాగతం పలికారు. కుటుంబ సమేతంగా వచ్చిన మారిషస్ అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మారిషస్ అధ్యక్షుడు గోకుల్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాన్వాయిలో గుంటూరుకు బయలుదేరారు. ఆదివారం గుంటూరులో జరిగే 3వ ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొననున్నారు. విమానాశ్రయంలో జరిగిన కార్యక్రమంలో మారిషస్ హై కమిషన్ మొదటి కార్యదర్శి గీతాంజలి, కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఐఎస్‌డబ్ల్యూ ఎస్‌పి ఆరిఫ్ హఫీజ్, జిల్లా ఎస్‌పి వి. విద్యాసాగర్ నాయుడు, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, విమానాశ్రయం డైరెక్టరు ఎం.ఎల్.కె.రెడ్డి, టర్మినల్ ఆపరేషన్ ఇన్చార్జ్ అధికారి అంకిత్ జైస్వాల్, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తరపున ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి ఎస్.విజయలక్ష్మి, ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

వార్త 8లో

విజయవాడలోని ఐజిఎంసి స్టేడియంలో జరుగుతున్న పుస్తక మహోత్సవం స్టాల్స్ వద్ద జనం

పుస్తకావిష్కరణలు, చర్చాగోష్టులు

వార్త 5లో

ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరులో జరిగిన బాలోత్సవంలో చిన్నారుల ప్రదర్శనలు

సందడిగా తిరువూరు బాలోత్సవం

ట్రంప్ సుంకాలతో ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలం : లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

ట్రంప్ సుంకాలు 2025లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అల్లకల్లోలం చేశాయని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. అవగాహన ఆధ్వర్యంలో అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో 2025లో ప్రపంచ, జాతీయ రాజకీయ అంశాలపై నిర్వహించిన విశ్లేషణ సభలో లక్ష్మణరావు మాట్లాడుతూ ట్రంప్ సుంకాల వల్ల మన దేశంలో రొయ్యలు, వస్త్ర పరిశ్రమ, వ్యవసాయ రంగం నష్టపోయిందన్నారు. ట్రంప్ ఆంక్షల వల్ల భారత విద్యార్థులు నష్టపోయారన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ వల్ల అనేక పెద్ద కంపెనీలు వేలాది మంది ఉద్యోగులను తొలగించాయన్నారు. దేశ సరిహద్దులలో ఉన్న నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్తాన్‌లో రాజకీయ అనిశ్చితి నెలకొందని చెప్పారు. ఎన్నికల కమిషన్ అమలు చేస్తున్న 'సర్' దేశవ్యాప్త విమర్శలకు గురై లక్షలాది ఓట్ల తొలగింపునకు కారణమైందన్నారు. ఆపరేషన్ కగార్ ద్వారా నక్సలైట్ల ఉద్యమం తీవ్ర నష్టాలు ఎదుర్కొందని వివరించారు. నాలుగు లేబర్ కోడ్‌ల అమలు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సమూలంగా మార్చటం అనేక విమర్శలకు గురైందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ నిర్ణయాలు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా లేవని, నిరుద్యోగం పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. వైద్య కళాశాలలను పిపిపి పద్ధతిలోకి తీసుకురావటంపై అన్ని రంగాల నుండి వ్యతిరేకత ఉందన్నారు. సభకు బి.దయాసాగర్ అధ్యక్షత వహించగా, విశ్లేషకులు గూడవల్లి నాగేశ్వరరావు, విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తదితరులు ప్రసంగించారు.

5న గ్రామ సభల్లో నూతన ఉపాధి హామీ చట్టాన్ని వ్యతిరేకించాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.నరసింహారావు పిలుపు

మీడియాతో మాట్లాడుతున్న వై.నరసింహారావు

ప్రజాశక్తి - గన్నవరం (ఉంగుటూరు) : ఈనెల 5న జరిగే గ్రామ సభల్లో ప్రజలు నూతన ఉపాధి హామీ చట్టాన్ని వ్యతిరేకించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై నరసింహారావు పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని, నూతనంగా ప్రవేశపెట్టిన విబి జి రాంజీ (వికసిత భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్) చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కామ్రేడ్ చింతపల్లి పాపారావు భవనంలో ప్రజాసంఘాల ఆద్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరసింహారావు మాట్లాడుతూ 2005లో జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం ప్రారంభించిన నాటి నంఉడి దేశంలో వలసలు తగ్గాయన్నారు. వ్యవసాయ కార్మికులు కూలి రేట్ల పెంపు విషయంలో యజమానులతో బేరమాడే వెసులుబాటు వచ్చిందన్నారు. ఉపాధి చట్టంలో భాగంగా ఎవరికి ఎప్పుడు పని కావాలని అడిగిన 15 రోజులలో పని చూపించేవారని, ఒకవేళ పని చూపించకపోతే పరిహారం చెల్లించాల్సి ఉండేదని అన్నారు. ప్రతి కుటుంబానికి 100 రోజులు పని గ్యారంటీ ఉండేదని, ఈ పనికి సంబంధించిన నగదు చెల్లింపులు 90 శాతం కేంద్రం, 10 శాతం రాష్ట్రం మెటీరియల్ కొనుగోలుకు చెల్లించేవని అన్నారు. ఈ కేటాయింపుల ద్వారా గ్రామాలలో అంతర్గత రహదారులు, అంగన్వాడీ భవనాలు, డ్రైనేజీలు, మరుగుదొడ్ల నిర్మాణం, రైతులు పంట సాగుకు అవసరమైన పంట కాలువలు తొవ్వకం లాంటి పనులు నిర్వహించే వారని గుర్తుచేశారు. ఇలాంటి చట్టాన్ని మూడురోజుల వ్యవధిలో రద్దు చేసి కొత్త చట్టాన్ని ఆమోదించారని అన్నారు. నూతనంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విబి జి రామ్ జి చట్టం ద్వారా 125 రోజులు పని కల్పిస్తున్నామని, వ్యవసాయ పనుల సీజన్‌లో ఉపాధి పనులు నిలిపివేయాలని, నిధులు కేటాయింపు కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం కేటాయించాలని, అది ముందుగా రాష్ట్ర ప్రభుత్వ వాటా ఖర్చు చేసిన తర్వాత మాత్రమే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలనే నిబంధనలు ప్రవేశ పెట్టారని, ఈ నిబంధనలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికే ఉపయోగపడతాయని అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కళ్లం వెంకటేశ్వరావు మాట్లాడుతూ ఉపాధి చట్టం రద్దు చేయడమే లక్ష్యంగా ఈ నిబంధనలతో కూడిన పేరు మార్పులు చేసిందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ చెప్పింది అమలు చేయడమే పనిగా పెట్టుకుందన్నారు. పేదలపై దాడి కొనసాగిస్తోందన్నారు. దీనిలో భాగంగానే 26 కోట్ల మందిని ఉపాధి చట్టానికి దూరం చేస్తోందన్నారు. ఈకార్యక్రమం లో రైతు, కౌలు రైతు సంఘం నాయకులు సూరగాని సాంబశివరావు, కైలే ఏసుదాసు పాల్గొన్నారు.

BEFORE THE HONBLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION AT KRISHNA VIJAYAWDA
C.C.NO.248/2025

Between :
Sri Bhavana Ganugula, D/o Ganugula Venkatachari, Aged 24 years, Resident of 68-4-8, Raghava Residency, Patamata, Vijayawada-520010. Complainant
AND
R2. Shadowfax Technologies Pvt. Ltd. Vijayawada Office: Ground Floor, 49-4-18/4D, Gunadala Railway Station, Machavaram, Vijayawada, Krishna, Andhra Pradesh -- 520004 Also at: Door No. 4-11-739, Near Muthoot Finance, Nalla Gate Down, Krishna Lanka, Vijayawada- 520013 Email: hello@shadowfax.in.
--Opposite Party.

పై నంబరు గల సి.సి లో పిటిషనరు అయినటువంటి గానుగుల శ్రీ భావన అను వారు మిమ్ములను 2వ ప్రతి వాదులు గా చూపించి పై కోర్టులో ఫిర్యాదు దాఖలు చేసియున్నారు. సదరు శ్రీ కోర్టువారు ఎన్ని సమన్లు పంపిననూ అందుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు సమన్లు పత్రికా ముఖంగా జారి చేయమని ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున మీరు ది.29-01-2026వ తేదీన ఉదయం 10-30 గం॥లకు శ్రీ కోర్టువారి ఎదుట స్వయంగా గానీ లేదా ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనగలరు. లేనిచో పై నంబరుగల అప్పీలును మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

వాయిదా: 29-01-2026

GANTA PRASAD, B.A., B.L.,
Advocate, D.NO. 45-18-6/3,
GUNADALA, VIJAYAWADA-4.
Cell : 9393930090.

LOST OF DOCUMENTS

I, **Dr. NAGALLA VIDYAKANNA,** W/o. SRI PONGURU CHANDRA SEKHAR REDDY, aged about 71 years, Resident of Door No.32-2/1-1/4, Rewati Apartment, Flat No.12, Prajasakthi Nagar, Vijayawada-520010, NTR District, do hereby solemnly affirm and state as follows: I submit that I lost five (5) original documents on 20-12-2025 while I am coming from RTC Bus Stand to Prajasakthi Nagar, Vijayawada, the said documents are **1) 5517/2011, 5175/2011, 850/2011, 851/2011 and 2238/1989** and I lost my bag along with the above said documents. Later, I noticed that I lost my bag containing the above said original documents. Despite diligent search, the said original document has not been found. The document has not been mortgaged with any government authority or private bank. If found, please inform us immediately. Any transaction carried out using the said document shall be treated as invalid, and the persons involved shall be liable for civil and criminal action.

Dr. NAGALLA VIDYAKANNA
Contact No. 98482 36354

రాజధానిలో జరీబు భూముల పరిశీలన

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో జరీబు భూములను మెట్ట భూములుగా పరిగణించడాన్ని నిరసిస్తూ రైతులు తమకు న్యాయం చేయాలని చాలా కాలంగా వేడుకుంటున్నారు. ఇటీవల రాజధాని రైతుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన త్రీమెన్ కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ప్రభుత్వం ఈ అంశం పై రాష్ట్ర స్థాయి అధికారులతో కూడిన బృందాన్ని నియమించింది. బృందం సభ్యులు శనివారం రాజధానిలోని బోరుపాలెం, అబ్బరాజు పాలెం లో క్షేత్ర స్థాయి పరిశీలన జరిపారు. సర్వే నెంబర్ ఆధారంగా రైతులను పిలిచి భూమి యొక్క స్థితిగతుల గురించి ఆరాతీశారు. 2014లో పొలంలో బోర్లు, విద్యుత్ బిల్లులు ఉన్నాయా లేవా.. ఏఏ పంటలు సాగు చేశారు లాంటి విషయాలపై ఆరా తీశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రైతులతో సమావేశ మవుతారని చెప్పి వెళ్లిపోయారు. కార్యక్రమంలో భూగర్భ జలవనరుల విభాగం జాయింట్ డైరెక్టర్ ఎన్ శ్రీనివాస్, ఎపిఎంఐపి ప్రాజెక్ట్ అధికారి ఎం వెంకటేశ్వర్లు, సిసిఎల్ డి ఎ సర్వే విభాగం జాయింట్ డైరెక్టర్ కెజియా, వ్యవసాయ శాఖ అదనపు డైరెక్టర్ శ్రీధర్ బృందంలో ఉన్నారు. సమస్య ఏమిటి..? నిరాజధాని నిర్మాణానికి 2014 -19లో భూ సమీకరణలో భూములిచ్చే సమయంలో జరీబు భూముల అంశం ముందుకొచ్చింది. కృష్ణానది తీర ప్రాంత గ్రామాల్లోని భూములు విలువ కలిగిన జరీబు భూములని, ఏడాదికి మూడు పంటలు పండుతాయని, నీటి లభ్యత పుష్కలంగా ఉంటుందని.. తమకు మెట్ట భూముల మాదిరి కాకుండా ప్యాకేజీ పెంచి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. దీంతో కృష్ణా తీరంలోని వెంకటపాలెం, తాళ్లాయపాలెం, లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం, రాయపూడి, అబ్బరాజుపాలెం, బోరుపాలెం గ్రామాలలో భూములను జరీబు భూములుగా నిర్ధారించేందుకు ప్రభుత్వం అప్పట్లోనూ వివిధ శాఖల అధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. జరీబుభూముల నిర్ధారణకు కొన్ని అంశాలను ప్రామాణికంగా తీసుకుంది. భూములు కృష్ణానదికి సమీపంలో ఉండడం, ఏడాదికి మూడు పంటలు పండటం, 20 - 30 అడుగులలో నీటి లభ్యత, చేలల్లో బోర్లు ఉండడం లాంటివి ప్రామాణికంగా తీసుకొని సుమారు 6 వేల ఎకరాలను సర్వే చేసి జరీబు భూములను నిర్ధారించింది. జరీబు భూముల ప్యాకేజీని

అబ్బరాజుపాలెంలో భూములను పరిశీలిస్తున్న అధికారుల బృందం

ప్రకటించింది. మెట్ట భూములకు ఎకరాకు కౌలు రూ.30వేలు, నివాస ప్లాట్లు 1000 గజాలు, వాణిజ్య ప్లాట్లు 250 గజాలు ఇచ్చింది. జరీబు భూములకు కౌలు రూ 50 వేలు, నివాస ప్లాట్లు 1000 గజాలు, వాణిజ్య ప్లాట్లు 450 గజాలు ఇచ్చింది. కొన్ని ఏళ్ళు జరీబు భూములకు ఇచ్చే కౌలు రూ 50 వేలు ఇచ్చి ఆ తరువాత జరీబు కాదంటూ మెట్ట భూములకు ఇచ్చే విధంగా ఎకరాకు కౌలు రూ 30 వేలు అనడంతో రైతులు మండిపడుతున్నారు. బోరుపాలెం, అబ్బరాజు పాలెం, రాయపూడిలో సుమారు 150 ఎకరాల జరీబు భూములను మెట్ట భూములుగా చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. జరీబు భూముల నిర్ధారణలో తమకు అన్యాయం జరిగిందని ఆయా గ్రామాల రైతులు ఆందోళనలు చేపట్టారు. అనేక రూపాలలో నిరసనలు తెలిపారు. నిమ్మ తోటలను జరీబుగా పరిగణించి ఎకరాకు రూ లక్ష పరిహారం చెల్లించి, కౌలు 50వేలు ఇవ్వడంతో పాటు జిరీబు భూములకు ఇచ్చే ప్యాకేజీ ఇచ్చి తరువాత జరీబు కాదు.. మెట్ట భూములంటూ అధికారులు చెప్పడం అన్యాయమని అంటున్నారు. దీంతో ప్రభుత్వం ఎట్టకేలకు ఈ అంశంపై వివిధ శాఖల అధికారులతో రాష్ట్ర స్థాయి బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో అధికారులు బోరుపాలెం,అబ్బరాజు పాలెంలో క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు.

ప్రకటన

యన్.టి.ఆర్ (కృష్ణా) జిల్లా, గంపలగూడెం మండలం, గంపలగూడెం మెయిన్ రోడ్డు ఇంటి నంబరు 2-92 గ్రామ కాపురస్తురాలు చారుగుండ్ల నరేంద్ర గారి భార్య చారుగుండ్ల సీతామహాలక్ష్మి (Seetha Mahalakshmi) సీతమహాలక్ష్మి (Sitha Mahalakshmi) అను నేను తెలియ జేయునది ఏమనగా నన్ను ఇప్పటి వరకు ఇంగ్లిష్ బాష నందు నా పేరును పై రెండు రకాలుగా రాస్తూవున్నాము నన్ను ఇప్పటి నుండి ఇంగ్లిష్ బాష నందు Seetha Mahalakshmi గా మార్చు కుంటున్నాను

IN THE COURT OF THE I ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT VIJAYAWADA
F.D.P.NO.5/2025 In O.S.No.198/2021

BETWEEN:
1) Bommareddy Narayana Reddy
2) Bommareddy Padmavathi
3) Bommareddy Devendra Reddy
..... Petitioners
And
Boppana Nagendra Rao ... Respondent
To,
Respondent
Boppana Nagendra Rao
S/o. Rama Krishna, Plot No.2, Layout No.42/2018, SMT Construction & Developers Ltd., Uruturu Road, Pamarru Village and Mandal, Krishna District.

The above numbered case stands posted to 08.01.2026 for the appearance of the Respondent to answer the claim of the Petitioner either in person or through his counsel before the Hon'ble Court from 10.30 onwards in the above mentioned court.

// By Order //

Vijayawada
Dt.02.01.2026

B.Koti Reddy,
B.S Ratnakar Reddy
Advocates
Ammana Estates ,Museum Road,
Governorpet, Vijayawada-2
Cell:9490148500

ప్రకటన

ఈ ద్వారా తెలియజేయునది ఏమనగా, శ్రీ మన్నం అశోక్ కుమార్, తండ్రి: దివంగత శ్రీ మన్నం గురునాధం, నివాసం: న్యూ ఏ.ఎస్. నగర్, విజయవాడ, వారు పాయకపురం రాజీవ్ నగర్ నందు ఆర్.ఎస్.నెం.45 (రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆర్.ఎస్. నెం. 45/2C లో భాగమైన) మొత్తం ఎకరాలు 0.91 సెంట్లలో మిగిలిన ఎకరాలు 0.42 సెంట్ల ఖాళీ స్థలాన్ని, ఇది ప్రస్తుతం ఆర్.ఎస్. నం.45 లోనే కొనసాగుతూ, శాంతియుతంగా ఆక్రమణలో ఉంచుకొని ఉన్నారు.

ఈ భూమి మొదటగా దివంగత శ్రీ మన్నం రాఘవులు గారి వారసత్వ ఆస్తి. ఆయన జీవితకాలంలో మౌఖిక కుటుంబ విభజన ప్రకారం తన ఇద్దరు కుమారులైన దివంగత శ్రీ మన్నం యేసురత్నం మరియు దివంగత శ్రీ మన్నం గురునాధం మధ్య పంచబడింది. మొత్తం భూమిలో నుండి ఆర్.ఎస్. నం.45/2C1 గా గుర్తించబడిన ఎకరాలు 0.49 సెంట్లు మాత్రమే ప్రభుత్వం చేత అవార్డు నం.1/86, తేది 17-01-1986 ప్రకారం స్వాధీనం చేయబడినది. భూస్వాధీనం ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో, దివంగత శ్రీ మన్నం యేసురత్నం గారు తన వాటాగా భావించిన భూమిలో నుండి 10 సెంట్లు ను శ్రీమతి నిమ్మగడ్డ (శివకుమార్ జట్టు భార్య) గారికి డాక్యుమెంట్ నం. 1466, తేది 14-02-1983, మరియు 5 సెంట్లు ను శ్రీమతి గెర్లపాటి లక్ష్మీ కుమారి, రామబ్రహ్మం భార్య గారికి డాక్యుమెంట్ నం.2728, తేది 16-04-1983, విజయవాడ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో అమ్మకాలు చేశారు.

అనంతరం ఆ స్వాధీనం చేయబడిన భాగానికి సంబంధించిన పరిహారాన్ని దివంగత శ్రీ మన్నం యేసురత్నం గారు O.P. నం.57/1986 (డిస్పోజల్ నం.3015/1997) ద్వారా రూ.9,372-95 స్వీకరించారు. మిగిలిన ఎకరాలు 0.42 సెంట్లు గల ఖాళీ భూమి ఎప్పుడూ ప్రభుత్వము చేత స్వాధీనం చేయబడలేదు, పరిహారం చెల్లించబడలేదు, అమ్మ బడలేదు మరియు ఇది ఇప్పటికీ ఆర్.ఎస్. నం.45 లోని కుటుంబ ఆస్తిగానే కొనసాగుతోంది.

ఈ ఆస్తిపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే, ఈ ప్రజా నోటీసు తేదీ నుండి 15 రోజుల్లోపు, తగిన పత్రా ధారాలతో క్రింది చిరునామాకు వ్రాతపూర్వకంగా తెలియజేయవలెను. లేనియెడల, ఏ అభ్యంతరాలు లేవని భావించబడును.

స్థలం: విజయవాడ,
తేది: 03/01/2026.

చిరునామా:
శ్రీ మన్నం అశోక్ కుమార్,
డోర్ నం. 43-151-17, సుందరయ్య రోడ్,
న్యూ ఏ.ఎస్. నగర్, పాయకాపురం / రాజీవ్ నగర్,
విజయవాడ - 520015,
ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్.

తండ్రి అంత్యక్రియలు నిర్వహించిన కుమార్తె

ప్రజాశక్తి- తాడేపల్లి

కుమార్తె కుమారుడై తండ్రికి అంతిమ సంస్కారం నిర్వహించి రుణం తీర్చుకుంది. తాడేపల్లి పట్టణంలోని కొత్తూరు సెంటర్లో నివాసం ఉంటున్న బుర్ర ముక్కు పోతురాజు రెడ్డి (53) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలు శనివారం విజయవాడ స్వర్గపురి లో నిర్వహించారు. పోతురాజు రెడ్డికి కుమారులు లేకపోవడంతో ఉన్న ఒక్కగా నొక్క కుమార్తె, దుఃఖాన్ని దిగమించుకొని తండ్రి అంత్యక్రియలు నిర్వహించింది.

పదిలో నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా కృషి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : నిర్దిష్ట ప్రణాళికతో పదవ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధ్యమేనని,ఆ దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.శనివారం ఉదయం నగర పరిధిలోని కృష్ణా విశ్వవిద్యాలయంలోని అల్లూరి సీతారామరాజు ఆడిటోరియంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన మార్చి 2026 పదవ తరగతి విద్యార్థుల వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రతి పాఠశాలకు ఒక జిల్లా అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించామని, వారు వారికి కేటాయించిన పాఠశాలను సందర్శించి, పదవ తరగతిలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపాలి అని సూచించారు. ముఖ్యంగా ప్రతి అధికారి, వారి పాఠశాలలో చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి జాబితా తయారు చేయాలని, వారు ఏఏ సబ్జెక్టుల్లో బలహీనంగా ఉన్నారో సంబంధిత తరగతి ఉపాధ్యాయుల సహకారంతో తెలుసుకుని, దాని ప్రకారం ఆ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. కేవలం స్లిప్ టెస్ట్ లు మాత్రం పెట్టడమే కాకుండా ఆ విద్యార్థి చదువులో వెనుకపడటంలో ఉన్న ప్రతికూల కారణాలు తెలుసుకోవాలని, ముఖ్యంగా కుటుంబ పరంగా విద్యార్థిని ఏమైనా కలవరపెట్టే అంశాలు ఉన్నా వారి తల్లిదండ్రులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కూన రాంజీ, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

పాఠశాలకు పుస్తకాల రాక్‌లు బహూకరణ

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ మండలం కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్ర ఓరియంటల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కూచిపూడికి చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ ఏలేశ్వరపు ప్రశాంత్ చొరవతో ప్రవాస భారతీయురాలు 3.40 లక్షల రూపాయల విలువగల పుస్తకాలు భద్రపరుచుకునేందుకు 22 రాకులు బహుకరించారు. గుంటూరుకు చెందిన ప్రవాస భారతీయురాలు మునగాల సరస్వతి (అమెరికా) స్పందనతో ఐదు నుంచి 10వ తరగతి వరకు గదుల్లో పుస్తకాలు భద్రపరుచుకోవడానికి ఆ రాకులను అందజేశారు. వారికి ప్రధానోపాధ్యాయురాలు అమిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర బృందం, విద్యార్థుల కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు.

వెంకట సత్యనారాయణకు పలువురు అభినందనలు

ప్రజాశక్తి -నందివాడ : మండలంలోని లక్ష్మీనరసింహపురం గ్రామానికి చెందిన పమిడి వెంకట సత్యనారాయణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సేవా పతకానికి ఎంపికవ్వడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ విధినిర్వాహణలో అంకితభావం, సేవాగుణం, పట్టుదల, ప్రతిభను గుర్తించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ సేవా పతకానికి ఎంపిక చేసింది. తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సేవా పతకంలో రాష్ట్రస్థాయిలో పదిహేను మందిని ఎంపిక చేయగా, అందులో పివి సత్యనారాయణ ఉండడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

హుండీ ఆదాయం రూ.2,96,121

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండలం విశ్వనాథపల్లి గ్రామంలో ఉన్న శ్రీ అద్దంకి నాంచారమ్మ దేవస్థానంలో శనివారం హుండీలు లెక్కించగా నోట్ల రూపంలో 2,61,750 రూపాయలు, కాయిన్స్ రూపంలో 34,371 రూపాయలు మొత్తం 2,96,121 రూపాయలు వచ్చినట్లు ఆలయ ఈవో జయశ్రీ తెలిపారు. ఈ లెక్కింపులో పర్యవేక్షణ అధికారి సాయి బాబు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

అధిక మోతాదులో పురుగుమందులు వాడొద్దు

ప్రజాశక్తి-పమిడిముక్కల : మినుము పంటకు అధిక మోతాదులలో పురుగుమందులు వాడరాదని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్ర వ్యవసాయ సమన్వయకర్త డి. సుధారాణి అన్నారు శనివారం పమిడిముక్కల మండలంలోని పమిడిముక్కల కోఆపరేటివ్ బ్యాంకులో జరిగిన సమావేశంలో ఆమె రైతులకు మినుము పంటకు వచ్చే వ్యాధులు వాటి నివారణ చర్యల గురించి వివరించారు.పంటకు సహజ ఎరువులు, ఆవు పేడ ఎక్కువగా వాడాలని తెలిపారు. వ్యవసాయ అధికారులు సునీల్ గవాస్కర్, నీటి సంఘం అధ్యక్షులు నాదెండ్ల సుబ్రహ్మణ్యం, రైతుల మైనేని కోటేశ్వరరావు, గురువింద పల్లి ప్రసాద్, ఆదిశేష తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి నిత్యావసర వస్తువులు పంపిణీ

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ మండలం కోసూరు గ్రామంలో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల పెద్ది పోయిన సీతారామాంజనేయులు ఇల్లు అగ్నికి ఆహుతి అవడంతో మొవ్వ శాఖ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వంట పాత్రలు,నిత్యవసర వస్తువులు, తార్పాలిన్ శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు, సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయం ఏ వో జొన్నలగడ్డ హనుమకుమార్, మొవ్వ ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు దేవినేని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు అందిస్తున్న దృశ్యం

రైతులు రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి : జెసి

ప్రజాశక్తి-పామర్రు : భూముల రీ సర్వే నూతన పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాలు సక్రమంగా అమలయ్యేలా స్థానిక అధికారులు చర్యలు తీసుకోవాలని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. మండలంలోని జుజ్జవరం గ్రామంలో జరిగిన మీభూమి మీహక్కు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పథకం అమలు తీరును ఆయన పరిశీలించి స్థానిక అధికారులకు తగు సూచనలు చేశారు. తమ భూముల్లో సమస్యలు ఏవైనా ఉంటే అధికారులు దృష్టికి తీసుకు వచ్చినప్పుడు వారు వెంటనే పరిష్కరిస్తారని రైతులతో అన్నారు.ఈ కార్యక్రమంలో పామర్రు మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్ బాబు, ఎంపీటీసీ సభ్యులు పసుపులేటి లక్ష్మీనాంచారమ్మ, ఎమ్మార్వో రవికాంత్ ఆర్ఐ రాము తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు** : మండలంలోని కనకవల్లి గ్రామంలో శనివారం తాశిల్దార్ కుసుమకుమారి అధ్యక్షతన మీ భూమి మీ హక్కు కార్యక్రమం నిర్వహించారు.గ్రామ ఉపసర్పంచ్ వీరంకి పరశురాం ఆధ్వర్యంలో పట్టాదార్ పాస్ పుస్తకాలను తహసీల్దార్ కుసుమ కుమారి రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు , వీఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పామర్రు మండలంలో మాట్లాడుతున్న జెసి

దివిసీమ కవి సూర్యనారాయణకు సత్కారం

ప్రజాశక్తి - నాగాయలంక : దివిసీమ కవి జి. సూర్యనారాయణను కృష్ణాజిల్లా జూడో అసోసియేషన్ చైర్మన్, బొండాడ గ్రూప్ సంస్థ చైర్మన్ బొండాడ రాఘవేంద్రరావు శనివారం స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి కాలేజీలో నూతనంగా ఏర్పాటుచేసిన జూడో శిక్షణా కేంద్రంలో సత్కరించారు. ఈ బొండాడ మాట్లాడుతూ సూర్యనారాయణ కలం నుంచి వచ్చిన గోరువెచ్చని సూరీడు, మట్టి మనిషి కవితా సంపుటులను తాను చదివానని, అవి చాలా బాగున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండలి వెంకట్రామ్, దుట్టా ఉమామహేశ్వరరావు, డా.గుడిసేవ విష్ణుప్రసాద్‌తో పాటు జూడో ప్రతినిధులు అభినందించారు.

ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : రెండు దశాబ్దాల పాటు కొనసాగిన జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్చి వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి వివిజి రామ్ జీ పేరుతో కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తున్న పథకాన్ని వెనక్కి తీసుకోవాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మచిలీపట్నం బుట్టాయిపేట మహాత్మ జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో కుల వివక్ష పోరాట సమితి, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. తొలుత భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నివాళులర్పించి సమావేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త ఉపాధి చట్టం వలన జరిగే నష్టాల గురించి సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారం ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పుడు వరకు కొనసాగుతున్న నరేగా పథకంలో పేదలు పని అడిగితే 15 రోజుల్లో పని ఇవ్వాల్సిన చట్టబద్ధమైన హక్కును ప్రస్తుతం కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టం నిర్వీర్యం చేస్తుందన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి చీకటి రాజేష్ అధ్యక్షత వహించగా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పి పవన్ పర్యవేక్షించారు. ప్రజా పర్యవేక్షణ కమిటీ జిల్లా నాయకులు, న్యాయవాది తాము మధుసూదన్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కె చంద్రశేఖర రావు, కోసూరు మాజీ సర్పంచ్ దగాని సుబ్బారావు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు కొడాలి శర్మ, కెవిపిఎస్ పట్టణ అధ్యక్షులు మిర్యాల ఆనంద్ బెన్జీ , కమిటీ సభ్యులు వసంతరావు, బాబురావు ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ నాయకులు కొలుకుల రాజారావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు ,తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై దాడి చేసిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-కంకిపాడు : వృద్ధ మహిళపై దాడి ఘటనలో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. వివరాల ప్రకారం కంకిపాడుకు చెందిన వక్కలగడ్డ వకుళాదేవిపై కట్టెపోగు కస్పకర్ మద్యం మత్తులో ఈనెల రెండో తేదీన అర్ధరాత్రి ఇంట్లోకి ప్రవేశించి కత్తెరతో దాడి చేశారు. ఈ ఘటనలో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. నిందితుడిని రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లారు.

ప్రముఖ వైద్యులు నరసింహారావు మృతి

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం నీలిమ నర్సింగ్ హోమ్ ప్రముఖ వైద్యులు వెనిగళ్ళ నరసింహారావు (70) గుండెపోటుతో శనివారం మృతిచెందారు. గన్నవరం, ఉంగుటూరు మండలాల ప్రజలకు సుపరిచితుడుగా గత నాలుగు దశాబ్దాలుగా వైద్య సేవలందించిన నరసింహారావు మృతితో గన్నవరం ప్రాంతంలో విషాద చాయలు అవరించాయి. ఆయన ఆకస్మిక మరణం వైద్య వత్తికి తీరని లోటని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

షఫ్దర్ హష్మీకి ఘన నివాళి

ప్రజాశక్తి - గుడివాడ : కళారూపాల ద్వారా ప్రజలను చైతన్య పరచిన షఫ్దర్ హష్మీ ప్రజలలో చిరంజీవిగా నిలిచి ఉంటారని సిఐటియు కృష్ణా జిల్లా ఉపాధ్యక్షులు వై. నరసింహారావు అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జరిగిన హష్మీ 37వ వర్ధంతి సభలో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి సాహితీ స్రవంతి అధ్యక్షులు లంకా సురేంద్ర అధ్యక్షత వహించారు. సాహిత్యాభిమానులు ఆర్.సి.పి.రెడ్డి, కె.కోటేశ్వరరావు, ఎ. వెంకటేశ్వరరావు, సుబ్బారావు, సాంబశివరావు, ఎ.విజయ్ కుమార్, కె.సురేష్, ఎ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్రాంతికి జూద క్రీడలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాబోవు సంక్రాంతిని పురస్కరించుకొని మండల పరిధిలో కోడిపందాలు, పేకాట, గుండాట నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని అవనిగడ్డ ఎస్సై కే. శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలు చట్టరీత్యా నేరమని, నిర్వహించే వారితోపాటు ప్రోత్సహించే వారిపై కూడా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈసందర్భంగా గత ఏడాది కోడిపందాలు నిర్వహించిన ప్రాంతాలను గుర్తించి అక్కడ హెచ్చరిక బ్యానర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : సాంప్రదాయ క్రీడలు ముద్దు జూద క్రీడలు వద్దు అనే నినాదముతో మండలంలోని ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.పలు ప్రాంతాల్లో నిషిద్ధ ప్రాంతాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసినట్లు ఎస్సై ఎన్ వివి సత్యనారాయణ తెలిపారు. సంక్రాంతికి కోడి పందాలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్సై ఆంజనేయులు, ఏఎస్ఐ జి వెంకటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.**ప్రజాశక్తి కోడూరు** : రానున్న సంక్రాంతి పండుగ నేపథ్యంలో జూద క్రీడలు వద్దని, సాంప్రదాయ క్రీడలే ముద్దని కోడూరు ఎస్సై చాణిక్య తెలిపారు. శనివారం కోడూరు శివారు స్వతంత్రపురం తదితర ప్రాంతాలలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కోడి పందాలు, జూద క్రీడలు నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపాధి హామీ చట్టం పేరు మార్చొద్దని కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం : బాపులపాడు మండలం బండారుగూడెంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం మార్చకూడదని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం కరపత్రాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బర్రె లెనిన్, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో అమ్రిత సాయి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల మండలం పరిటాల సమీపంలోని అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు జె.యన్.టి.యు కాకినాడ నిర్వహించిన సెంట్రల్ జోన్ బాడ్మింటన్ పోటీలలో మొదటి బహుమతి కైవసం చేసుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డా యమ్.శశిధర్ శనివారం తెలిపారు. ఇటీవల విజయవాడ వీఆర్ సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలో జెయన్‌టియు కాకినాడ నిర్వహించిన సెంట్రల్ జోన్ షటిల్ బాడ్మింటన్‌లో అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి యూనివర్సిటీ స్థాయిలో సత్తా చాటడం గర్వకారణమని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ కె.రామమోహనరావు తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ పి.శ్రీనివాస రావు సిబ్బంది పాల్గొన్నారు.

సావిత్రి బాయికి భారతరత్న ఇవ్వాలి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : కోట్లాది మంది ఆడబిడ్డల జీవితాల్లో అక్షరాల వెలుగు నింపిన జ్ఞానజ్యోతి, భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు, మహాత్మ సావిత్రీబాయి పూలేకు "భారతరత్న" పురస్కారం ప్రకటించాలని బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ డిమాండ్ చేశారు. నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో "గురుచైతన్య ఉపాధ్యాయ సంఘం" ఆధ్వర్యంలో జరిగిన సావిత్రీబాయి పూలే జయంతి ఉత్సవాలు, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానోత్సవానికి బోడె రామచంద్రయాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి, పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సావిత్రీబాయి స్ఫూర్తితో చదువుకుని, ఉన్నత స్థానాల్లో ఉన్న ఎందరో నాయకులు ఈ గడ్డపై ఉన్నప్పటికీ, ఆమెకు గౌరవం ఇవ్వాలన్న సోయి లేకపోవడం సిగ్గుచేటు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు రావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. "ఉపాధ్యాయులు ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నారు. వారి హక్కుల కోసం, విద్యావ్యవస్థ పరిరక్షణ కోసం బీసీవై పార్టీ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని తెలిపారు.

41వ డివిజన్ లో ప్రజాదర్బార్

ప్రజాశక్తి - విజయవాడసిటీ : ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజాదర్బార్ వేదికగా నిలుస్తుందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. భవానీపురం 41వ డివిజన్ మస్జిద్ రోడ్ లో శనివారం ఎంపీ కేశినేని శివనాథ్ ఎన్డీయే కూటమి నాయకులు, ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో కలిసి ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజలతో స్వయంగా మాట్లాడి వారి నుంచి ఎంపీ కేశినేని శివనాథ్ అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీ పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఎంపీ ఆదేశించారు. కార్యక్రమంలో దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, మాజీ ఎమ్మెల్యే, బుద్దా వెంకన్న, నియోజకవర్గ పరిశీలకులు చిట్టాబత్తిన శ్రీనివాసరావు, 41వ డివిజన్ ప్రెసిడెంట్ సంతోష్ కుమార్, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్, ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధికార ప్రతినిధి రేగళ్ల లక్ష్మణరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : 45 వ డివిజన్ లో అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు.. ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రతిపాదనల తో స్థానిక లక్ష్మీ నగర్ క్రాస్ రోడ్స్ వద్ద 320 మీటర్ల మేర సీసీ రోడ్డు, ఓపెన్ డ్రైన్ పనులకు స్థానిక కార్పొరేటర్ మైలవరపు మాధురీ లావణ్య శంకుస్థాపన చేశారు.. ఈ మేరకు శిలా ఫలకం వద్ద పూజ చేసి ఆవిష్కరించారు.. మొత్తం 49.67 లక్షల రూపాయల అంచనాతో ఈ పనులు పూర్తి చేయనున్నారు.. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పురుషోత్తం, ఏఈ జాస్మిన్ , స్థానిక టీడీపీ నాయకుడు మైలవరపు కృష్ణ, అత్తులూరి పెదబాబు, తదితరులు పాల్గొన్నారు

ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం

- ఏపి ఎన్‌జిజిఓ రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఉద్యోగుల సంక్షేమమే మా ఆశ, శ్వాస అని, లక్షలాది ఉద్యోగుల బలగమే తమ ఆలోచనలకు, కార్యాచరణకు శక్తిగా నిలుస్తోందని ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ అన్నారు. ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ ఎన్‌టీఆర్ జిల్లా శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు శనివారం నగరంలోని గాంధీనగర్ ఏపీ ఎన్‌జీవో హోంలో జరిగాయి. ఈ సందర్భంగా ఓల్డ్ బస్టాండ్ నుంచి ఎన్‌జీవో హోంవరకు జరిగిన ర్యాలీకి జిల్లా నలుమూలల నుంచి భారీగా ఉద్యోగులు తరలివచ్చారు. ర్యాలీలో విద్యాసాగర్ పాల్గొని మాట్లాడుతూ.. గత ఎనిమిది నెలల కాలంలోనే ప్రభుత్వంతో చర్చల ద్వారా రూ.13 వేల కోట్ల మేర ప్రయోజనాలు సాధించగలిగామని తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ ఉద్యోగ, ఉపాధ్యాయ,పెన్షనర్ల శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ మాట్లాడుతూ సంఘం ఐక్యతే తమ విజయానికి మూలమని, ఉద్యోగుల హక్కుల సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

జిల్లా శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక : ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ ఎన్‌టీఆర్ జిల్లా శాఖకు జరిగిన ఎన్నికల్లో 17 పోస్టులకు గాను ఒక్కో పోస్టుకు ఒక్కో నామినేషన్ దాఖలు కావడం జరిగిందని... అధ్యక్షునిగా బి.సత్యనారాయణరెడ్డి (కోఆపరేటివ్), సహాధ్యక్షుడిగా వీవీ ప్రసాద్ (ఐ అండ్ పీఆర్), కార్యదర్శిగా పి.రమేష్ (జలవనరులు), కోశాధికారిగా బి.సతీష్ కుమార్ (ఆర్ అండ్ బీ), కార్యనిర్వాహక కార్యదర్శిగా బీవీ రమణ (వైద్య ఆరోగ్యం), ఉపాధ్యక్షులుగా వి.నాగార్జున (ఐటీఐ), ఎం.గోపాలకృష్ణ (పశుసంవర్ధక), జి.రామకృష్ణ (పశు సంవర్ధక), ఆర్.శ్రీనివాసరావు (రెవెన్యూ), షేక్ జానీపాషా (జీఎస్‌డబ్ల్యూఎస్), మహిళా సహాధ్యక్షురాలిగా కె.శివలీల (వైద్య ఆరోగ్యం), సంయుక్త కార్యదర్శులుగా ఎం.రాజుబాబు (రవాణా), సీహెచ్ దిలీప్ కుమార్ (కమర్షియల్ ట్యాక్స్), డి.విశ్వనాథ్ (రిజిస్ట్రేషన్), సీహెచ్ మధుసూధనరావు (పాలిటెక్నికల్), ఎం.శ్రీనివాసరావు (పంచాయతీరాజ్), మహిళా సంయుక్త కార్యదర్శిగా సీహెచ్ శ్రీదేవి (ట్రెజరీ)లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కె.జగదీశ్వరరావు ప్రకటించి.. నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. సహాయ ఎన్నికల అధికారిగా బి.జానకి, పర్యవేక్షకులుగా వి.సుబ్బారెడ్డి వ్యవహరించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య అన్నారు. పెనుగంచిప్రోలు మండలంలోని సుబ్బాయి గూడెం గ్రామంలో రైతులకు పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శాంతిలక్ష్మీ , పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, ఎంపీటీసీ వెల్ది ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపి వైవి సుబ్బారెడ్డిని కలిసిన పోతినేని



ప్రజాశక్తి -విజయవాడ సిటీ: రాజ్యసభ సభ్యులు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల రిజనల్ కో ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి ని వైయస్సార్‌సీపీ గుంటూరు పార్లమెంట్ ఇంచార్జ్ పోతిన మహేష్ మర్యాదపూర్వకంగా కలిశారు.శనివారం తాడేపల్లి లోని ఆయన నివాసం నందు సుబ్బారెడ్డి ని కలిసి శాలువాతో సత్కరించి పోతిన వెంకట మహేష్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

తల్లిదండ్రుల్లో మార్పు రావాలి : డిఇఓ

ప్రజాశక్తి - తిరువూరు : ప్రభుత్వాలు తల్లికి వందనం, మధ్యాహ్న భోజనంతో పాటు అనేక సౌకర్యాలు, సదుపాయాలు కల్పిస్తున్నా కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రుల్లో మార్పు రాకపోవటం విచారకరమని జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎల్ చంద్రకళ పేర్కొన్నారు. వాళ్ళో మార్పు వస్తేనే స్కూల్స్ డ్రాప్ అవుట్ ఉండవని తెలిపారు. తిరువూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం ఆమె సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతిఒక్క విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకో వాలన్నారు.

బావిలో పడి రైతు మృతి

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణానికి చెందిన రైతు కామసాని వెంకట మోహన్ (46) పొలానికి నీరు పెడుతూ కాలుజారి బావిలో పడి మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నందిగామ ఎంఎల్ఏ తంగిరాల సౌమ్య, శనివారం మోహన్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

పాస్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ మండలం సత్యవరం గ్రామంలో శనివారం సత్యవరం గ్రామంలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. నందిగామ ఆర్డిఒ కె. బాలకృష్ణ, తహశీల్దార్ సురేష్ లు శనివారం రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు.

దుర్గగుడి హుండీ ఆదాయం రూ.3.6 కోట్లు

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శనివారం హుండీలను తెరిచి లెక్కించారు. 16 రోజుల వ్యవధిలో యాత్రికులు నగదు రూపంలో రూ.3,06,65,288, 341 గ్రాముల బంగారం, 3 కిలోలు 586 గ్రాముల వెండి సమకూరింది. అమెరికా, ఇంగ్లాండ్, కువైట్, యూరప్ సహా పలు దేశాల విదేశీ కరెన్సీ కూడా యాత్రికులు సమర్పించారు.

త్రిలోచనాపురంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: డాక్టర్ నార్ల తాతారావు తాప విద్యుత్ కేంద్రంలో మూలపాడు పంచాయతీ పరిసర గ్రామమైన త్రిలోచనాపురంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా మెడ్ స్టార్ హాస్పిటల్, ఫైన్ హాస్పిటల్, హెచ్.సి.జి. కాన్సర్ హాస్పిటల్స్, స్రవంతి హాస్పటల్, అమరావతి ఐ హాస్పిటల్, వశిష్ట డెంటల్ క్లినిక్, ఇబ్రహీంపట్నం వారి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని డాక్టర్ నార్ల తాతారావు తాప విద్యుత్ కేంద్రం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల, యన్.టి.ఆర్ (జిల్లా), త్రిలోచనాపురం, మూలపాడు పంచాయతీ నందు పర్యవేక్షక ఇంజనీర్ సివిల్ కె. బాబూరావు ప్రారంభించారు. ఉచిత మెగా వైద్య శిబిరంలో ఊపిరితిత్తుల పరీక్షలు, ఎలక్ట్రోకార్డియోగ్రాఫ్ పరీక్షలు, ఇకో పరీక్షలు, మధుమేహ వ్యాధి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఎన్‌టిటిపిఎస్ కాలుష్యంపై గ్రామస్తుల ఆగ్రహం

మూలపాడు పంచాయతీలోని త్రిలోచనాపురంలో ఎన్‌టిటిపిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం ప్రారంభ సభలో త్రిలోచనాపురం మూలపాడు, గ్రామస్తులు, నాయకులు ఎన్టిటిపిఎస్ బూడిద కాలుష్యంపై ఎన్‌టిటిపిఎస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలుష్య పీడిత గ్రామాలకు అందించవలసిన సి ఎస్ ఆర్ ఫండ్స్ కూడా ఇవ్వకుండా, రోగాలను బహుమతిగా ఇస్తూ, వైద్య శిబిరాల పేరిట కాలక్షేపం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య పీడిత ప్రాంతాల్లో సిఎస్ఆర్ ఫండ్ అందించి, కాలుష్య నివారణ చర్యలు వెంటనే చేపట్టాలని కోరారు.

కృష్ణానదిలో చేప పిల్లలు విడుదల

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి కోసం కృష్ణానదిలో భారీ సంఖ్యలో చేప పిల్లల్ని విడుదల చేస్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాదు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద గంగ పుత్రులతో కలిసి ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాదు కృష్ణానదిలో శనివారం చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణ ప్రసాదు మాట్లాడుతూ కృష్ణానదిలో మత్స్య సంపదను పుష్కలంగా పెంపొందించే క్రమంలో ప్రతి ఏడాది మత్స్యశాఖ ద్వారా చేప పిల్లలను విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

షాపుల నిర్వహణకు 7న వేలం పాట

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని వేదాద్రి శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు సమక్షంలో ఈ నెల 7వ తేదీ ఉదయం 11 గంటలకు కూల్ డ్రింక్స్, పటములు, బొమ్మలు అమ్ముకొనుటకు లైసెన్సు పొందుటకు 2 సంవత్సరాల కాలపరిమితికి దేవస్థాన ప్రాంగణమందు సీల్డు టెండరు-కం-బహిరంగ వేలము పాటలు, ఇ-టెండరు జరుపబడునని దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త వెలగపూడి లక్ష్మణదత్తు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు శనివారం ఒక ప్రకటనలోతెలిపారు. ఆసక్తి గలవారు ధరావత్తు చెల్లించి బహిరంగ వేలము పాటలలో పాల్గొనాలని కోరారు.

6 నుండి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జనవరి 6 నుంచి 8 వరకు పశ్చిమ ఇబ్రహీంపట్నంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ మెన్స్ ఉమెన్స్ పోటీలు జరగనున్నట్లు నిర్వాహకులు రావి ఫణి తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా పశ్చిమ ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్ గ్రౌండ్‌లో ప్రతి రోజు సాయంత్రం 4 నుండి మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని టీములు నిర్ణీత సమయానికి రావాలని, ఒక టీం లో ఆడిన వారు వేరొక టీం లో ఆడరాదు అని, ఎంపైర్ మేనేజ్మెంట్ నిర్ణయమే తుది నిర్ణయమని, నాకౌట్ పద్ధతిలో మ్యాచ్ లు నిర్వహించ బడతాయని తెలియజేశారు.

కాకతీయ అపోలో విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి- నందిగామ : విద్యా వ్యవస్థలో కాకతీయ అపోలో విద్యాసంస్థల 40 వసంతాల ప్రస్థానం సందర్భంగా నందిగామ పట్టణ పురవీధులలో విద్యార్థులు పెద్ద ఎత్తున ప్రదర్శనా ర్యాలీ నిర్వహించారు. కాకతీయ జెండాను ఆవిష్కరించి ర్యాలీని మున్సిపల్ చైర్పర్సన్ మండవ వరలక్ష్మి జెండా ఊపి శనివారం ప్రారంభించారు. విద్య యొక్క ఆవశ్యకతను తెలియజేస్తూ నందిగామ పుర వీధుల్లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కాకతీయ అపోలో విద్యాసంస్థలు అధినేత కాపా రవీంద్ర - భారతి, స్కూల్ ప్రిన్సిపాల్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరువూరులో సందడిగా పిల్లల పండుగ

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు బాలోత్సవం 4వ పిల్లల పండుగ శనివారం తిరువూరు శ్రీవాహిని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినీ విద్యార్థుల ఆట, పాట, డాన్సులు, కళా నైపుణ్యాలతో సందడిగా మారింది. గంపలగూడెం, ఏ.కొండూరు, విస్సన్నపేట, తిరువూరు మండలాల నుండి 65 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 2500 మంది విద్యార్థులు పాల్గొని 32 విభాగాలలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్, వక్తృత్వం, ఏక పాత్రాభినయం, కోలాటం, క్లాసికల్, ఫోక్ డ్యాన్స్, వ్యర్థాలతో ఉపయోగపడే వస్తువుల తయారీ, నీటిని శుద్ధి చేసే యంత్ర తయారీ, మట్టితో బొమ్మలు చేయడం వంటి పోటీలలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఇది మా పండగని సంబరపడుతూ విద్యార్థులు ఉత్సాహంగా, ఉల్లాసంగా కేరింతలతో సందడి చేశారు. వారి వెంట వచ్చిన ఉపాధ్యాయులు కూడా ఆనందంగా పాల్గొని బాలోత్స కమిటీ సభ్యులకు సహాయ సహకారాలు అందించారు. నాలుగేళ్ల నుండి విజయవంతంగా కొనసాగుతున్న ఈ బాలోత్సవం పిల్లల్లో దాగి ఉన్న కళా నైపుణ్యాన్ని బయటికి తీసి వారిలోని భయాన్ని పోగొడుతుందని ఉపాధ్యాయులు చర్చించుకోవడం విశేషం. ఖర్చుతో కూడుకున్న బాలోత్సావ్ని నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

బహుమతులు అందిస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాసరావు

నైపుణ్యాలను వెలికితీసేందుకు బాలోత్సవం దోహదం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు బాలోత్సవం 4వ పిల్లల పండుగ శనివారం శ్రీవాహిని ఇంజనీరింగ్ కళాశాలలో సావిత్రిబాయి పూలే సభ మందిరంపై అట్టహాసంగా జరిగాయి. ముఖ్య అతిథిగా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు హాజరై విద్యార్థుల కేరింతల నడుమ పిల్లల పండుగను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో ని నైపుణ్యాలను వెలికితీయటానికి ఈ బాలోత్సవం ఎంతో దోహదపడుతుందని అన్నారు. నందిగామ డివైఈవో ఎం.శ్యామ్ సుందరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొనేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహిం చాలన్నారు. ఇది పిల్లలకు ఒక పండుగ అని, అన్ని రంగా ల్లో అభివృద్ధి చెందేందుకు మంచి వేదికని తెలిపారు. విద్యతో పాటు అన్ని కలిసి ఉన్నప్పుడే విద్యార్థి సమగ్రంగా అభివృద్ధి చెందుతారన్నారు. తిరువూరు బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.హరికృష్ణ మాట్లాడుతూ బాలోత్స వం అనేది పిల్లల సృజనాత్మకతను వెలికితీ యడానికి, వారిలో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహిం చడానికి నిర్వహించబడుతుందని తెలిపారు. ఇండి యన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ తాళ్లూరు రామ కోటేశ్వరరావు మాట్లాడుతూ నిరంతరం చదువు మీదే ధ్యాస కాకుండా శారీరక శ్రమ మీద కూడా దృష్టి సారించి శారీరక ధృఢత్వాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ వి.రవీంద్ర మాట్లాడుతూ విద్యార్థి దశనుండే పోటీతత్వాన్ని అలవర్చుకొని సైన్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. వివిధ విభాగాల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఉచిత యోగా శిక్షణా తరగతుల కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఈనెల 5 వ తేదీ నుండి 11వ తేదీ వరకు నగరంలోని చింతగుంటపాలెంలో నిర్వహిస్తున్న ఉచిత యోగా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రజలకు, ప్రభుత్వ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ బంగ్లాలో కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ యోగాసభ మచిలీపట్నం శాఖ చింతగుంటపాలెం దివ్య యోగ మందిర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత యోగా శిక్షణ, చికిత్స శిబిరం పై రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగా సాధన తో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. ఈ ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం ఉదయం 5:30 గంటల నుండి 8 గంటల వరకు ఉత్తర భారత్ నుండి విచ్చేయుచున్న యోగా నిష్ణాతులు, నిపుణులచే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా గురువులు జి గురునాథ్ బాబు, మద్దాల చింతయ్య, సమాచార పౌర సంబంధాల శాఖ డిడి యమ్.వెంకటేశ్వర ప్రసాద్, యోగ సభ్యులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ వెంకట్‌కు పురస్కారం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : హెల్పింగ్ హ్యాండ్స్ వెంకట్ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో ఎన్నో ఏళ్లుగా చేస్తున్న సేవలకు వెంకట్‌కు అనకాపల్లికి చెందిన డాక్టర్ కొణతాల రామలింగ స్వామి పురస్కారం లభించడం పట్ల మచిలీపట్నం వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రామలింగస్వామి మెమోరియల్ ట్రస్ట్ నుండి ప్రతి ఏడాది ఒక సామాజిక సేవకుడికి గౌరవంతో ఇచ్చే ఈ పురస్కారం ఈ ఏడాది హెల్పింగ్ హ్యాండ్స్ వెంకట్ కు ఇస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షురాలు కొణతాల లక్ష్మీ పార్వతి, కొణతాల ఫణి భూషణ్ ఒక ప్రకటనలో తెలిపారు. చందన వెంకట్ ఎన్నో ఏళ్లుగా వేలాది మంది అనాథ లకు అంత్యక్రియలు చేయడం, అనాధలకు ఆశ్రయం ఇవ్వడం, నిత్య భోజన పంపిణీ, విద్య వైద్యానికి సంబం ధించి చేసిన పలు రకాల సేవలకు గాను ఇప్పటికే డాక్టరేట్ పొం దారు. ఈ అవార్డ్ సంక్రాంతి కానుకగా జనవరి 14 వ తేదీన అనకాపల్లిలో అవార్డు ప్రదానం చేస్తారని హెల్పింగ్ హాండ్స్ సిబ్బంది తెలిపారు.

ఎఎన్ఎం హైస్కూల్లో రంగవల్లుల పోటీలు

ప్రజాశక్తి-పామర్రు : స్థానిక ఏఎన్ఎం హైస్కూల్లో శనివారం రంగవల్లుల పోటీలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు ఆర్.రంగవల్లి, బి.దేవి న్యాయ నిర్ణీతలుగా వ్యవహరించారు. జూనియర్ విభాగంలో వరుసగా పి. ధనలక్ష్మి,బి.పవిత్ర, ఏ దీక్షిత, ఎన్ జోషిక సీనియర్స్ విభాగంలో పి వైష్ణవి, సిహెచ్ ధాత్రి శరణ్య, ఎం గీతిక విజేతలకు బహుమతులు అందుకున్నారు. విజేతలను ప్రిన్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి,హెచ్ఎం శామ్యూల్ సిబ్బంది అభినందించారు.

కొండలమ్మ ఆలయంలో చండీ హోమం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరంలో ఉన్న కొండ లమ్మ ఆలయ ప్రాంగణంలో పౌర్ణమి ప్రత్యేక పూజలను శనివారం వేద పండితులు నిర్వహించారు. అనంతరం చండీ హెూమాన్ని వేద మంత్రోచ్ఛరణ నడుమ చేపట్టారు. పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారి భక్తుల సర్వ శ్రేయస్సు, ఆయురారోగ్య, ఐశ్వర్య అభివద్ధికి ఈ హెూమాన్ని చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే విష్ణు వెంకట మోహన్‌రావు పాల్గొన్నారు.

పాస్‌పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలం కొనతనపాడు, చలివెంద్రపాలెం గ్రామాలలో తహశీల్దార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైతుకు పట్టా పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్, ఆర్డీఓ హెలా షారోను పాల్గొని పాస్‌పుస్తకాలు పంపిణీ చేశారు .**ప్రజాశక్తి-మొవ్వ :** మొవ్వ మండలం అయ్యంకిలో 1215, చిన ముత్తేవిలో 1087, అవురుపూడిలో 650 పట్టాదారు పాస్ పుస్తకాలను తహసిల్దార్ కే మస్తాన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.ఆర్.ఐ ఏ.విజయదుర్గ, వీఆర్వోలు ఎం ఝాన్సీ, ఎం ఖాసిం రహమాన్నీసా, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : 'స్వచ్ఛ సంక్రాంతి' లక్ష్యంగా ప్రతి గ్రామ పంచాయతీలో పరిశుభ్రత కార్యక్రమాలు సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జె.అరుణ సూచించారు. మచిలీపట్నం డివిజన్ పంచాయతీ అధికారులు డిప్యూటీ ఎంపీడీవోలకు "స్వచ్ఛ సంక్రాంతి" పై శనివారం జిల్లా పరిషత్ సమావేశ హాలులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ జిల్లాలో గ్రామాల్లో ముఖ్యంగా రోడ్ల పక్కన ఎలాంటి లెగసీ వ్యర్థాలు లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే గ్రామాల్లోని ఇళ్ల పన్నుల వసూలుపై ప్రత్యేక దష్టి సారించాలని, నిర్ణీత లక్ష్యాలను సాధించేలా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా డిప్యూటీ ఎంపీడీవోలు మరియు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పని చేయాలని, రోజువారీ పర్యవేక్షణ పెంచాలని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో డివిజనల్ పంచాయతీ అధికారి ఎం డి.రజావుల్లా పాల్గొన్నారు.

మహిళల అణిచివేతను తిప్పికొట్టాలి

● సావిత్రిబాయి పూలే జయంతిలో వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయవాడ : సావిత్రిబాయి పూలే 195వ జయంతి విజయవాడ నగరంలోని వారోత్సవ భవన్లో కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి నటరాజు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా డిఎస్ఎస్ఎం జాతీయ నాయకులు వి శ్రీనివాసరావు మాట్లాడుతూ సనాతన ధర్మం పేరుతో మహిళలను అణిచివేసే ధర్మం నేడు అవసరం లేదన్నారు. మహిళాలోకం ముక్త కంఠంతో తిప్పుకొట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆ విధమైన సామాజిక చైతన్యాన్ని సావిత్రిబాయి పూలే 150 సంవత్సరాల క్రితమే ఒక పరిపూర్ణ మహిళగా మహిళ జీవితాల్లో కొత్త వెలుగులు నింపారని అన్నారు. బాల్యవివాహాలను వ్యతిరేకించి భర్త చనిపోయిన మహిళలను పునర్వివాహాలకు సంసిద్ధలను చేయగలిగారని తెలిపారు. ఆనాటి దుష్టాంతరాలను కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పునర్ ప్రతిష్ఠించేందుకు శ్రీకారం చుట్టుతోందన్నారు. మనిషిని మనిషిగానూ, స్త్రీలను సమానంగా చూడలేని సనాతన ధర్మాన్ని అందరూ అనుసరించాలని అనటం దురదృష్టకరమని అన్నారు. సనాతన ధర్మాన్ని తిప్పికొట్టడమే సావిత్రిబాయికి నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్టు ప్రధాన నాయకులు పి మధు, కార్యదర్శి పి మురళీకృష్ణ, పెద్దలు బిఆర్ తులసిరావు, బాలోత్సవ భవన్ నాయకురాళ్ళు పావని, కె.గీత, షేక్ వాహిదా, నందిని, షేక్ నూర్జహాన్, కెవిపిఎస్ రాష్ట్ర నాయకురాలు జి.అరుణ, సి హెచ్ శ్రీనివాస్‌రావు, జి సుధీర్, కె.క్రాంతి, నిర్మల తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

ప్రజాశక్తి - విజయవాడసిటీ : సామాజిక రుగ్మతలపై సమరభేరి మోగించిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. శనివారం చిట్టినగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్లో ఇంటర్ నేషనల్ బిసి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే సుజనా చౌదరి హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రధానోత్సవం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ ఛైర్మన్ కె.నాగుల్ మీరా, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, చిట్టి నగర్ గుడి కోశాధికారి పిల్లా శ్రీను, పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రెడ్డిగూడెం :రెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన సావిత్రీ బాయిపూలే జయంతి వేడకల్లో ఉత్తమ ఉపాధ్యాయులు ఐ.ధర్మశీల, పి.ప్రగతి, పి.కస్తూరి లలితలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు బీ వీ ఎస్ నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శి డి.ప్రకాష్, సహాధ్యక్షురాలు డి.విజయలక్ష్మి, పాల్గొన్నారు. మండలంలోని ఎంపిపి పాఠశాల (మెయిన్)లో ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు చాట్లవిజయకుమార్ ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ప్రజాశక్తి-ఎ కొండూరు : ఎ కొండూరు మండలం కంభంపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్లో ఏ కొండూరు మండలం యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు బి.అర్జున్ రావు, బీవీ దుర్గారావు పాల్గొన్నారు. పాత రేపూడి మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయిని యు గౌతమిని, కంభంపాడు మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయురాలు డి జ్యోతిని ఘనంగా సన్మానించారు.

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: జనవిజ్ఞాన వేదిక కొండపల్లి శాఖ ఆధ్వర్యంలో క్రాంతి హైస్కూల్లో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జన విజ్ఞాన వేదిక కొండపల్లి శాఖ అధ్యక్షులు ఎలమందయ్య, సుప్రీంకోర్టు న్యాయవాది పోతూరి సురేష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వెనిగళ్ళ మురళీమోహన్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు 9, 10 తరగతుల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎంపి కేశినేని శివనాథ్

యుటిఎఫ్ డైరీ, కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-వత్సవాయి : యుటిఎఫ్ డైరీ, కేలండర్‌ను వత్సవాయి మండల విద్యాశాఖ అధికారి ఎల్.నాగరాజు శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ వత్సవాయి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అజ్మీర్ శ్రీను, సుబ్రహ్మణ్యేశ్వరరావు, నాయకులు పుల్లయ్య, పులి శ్రీనివాసరావు, ఎస్‌కె హుస్సేన్ సాహెబ్, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, మురళీకృష్ణ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సావిత్రిబాయి పూలే జన్మదినోత్సవం సందర్భంగా వత్సవాయి ప్రధానోపాధ్యాయురాలు అనితను సన్మానించారు.

సిపిఎం సీనియర్ నేత వెంకయ్య మృతి

ప్రజాశక్తి-ఏ కొండూరు : సిపిఎం సీనియర్ నాయకులు రావుల వెంకయ్య (86) శనివారం మధ్యాహ్నం అనారోగ్యంతో కంభంపాడులోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయన 1970 నుండి సిపిఎం సభ్యుడుగా, కంభంపాడు శాఖ కార్యదర్శిగా పనిచేశారు. కంభంపాడులో పార్టీ పటిష్టతకు ఎనలేని కృషి చేశారు. మండలంలో సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన భూ పోరాటాలలో క్రియాశీలకంగా వ్యవహరించారు. వెంకయ్య మృతి విషయం తెలిసిన వెంటనే సిపిఎం మండల కార్యదర్శి పి.ఆనందరావు, నాయకులు జెట్టి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు సిహెచ్.కనకయ్య, బి శ్రీను, టి గోపాలరావు, ఎస్ మోహన్‌రావు, కె వెంకటేశ్వర్రావు, ఎ అమ్మిరెడ్డి తదితరులు ఆయన భౌతికకాయంపై పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. వెంకయ్య మృతి పార్టీకి తీరని లోటు అని అన్నారు. వెంకయ్యకు ఐదుగురు సంతానం కాగా ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు రావుల రామప్ప ప్రస్తుతం కంభంపాడు సిపిఎం శాఖ కార్యదర్శిగా పని చేస్తున్నారు.

ఘనంగా సాంస్కృతిక ఉత్సవ్ లక్ష్య

ప్రజాశక్తి-మైలవరం స్థానిక లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 19వ సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవ లక్ష్య2026 శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా డైరెక్టర్, కన్సల్టింగ్, టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ రవివర్మ దాట్ల పాల్గొని మాట్లాడుతూ పరిశ్రమలలో ఇంటర్న్‌షిప్ చేయటం వల్ల విద్యార్థుల నైపుణ్యాలు మెరుగవుతాయని, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఎల్‌బిఆర్‌సిఇ కో ఫౌండర్ లక్కిరెడ్డి జయప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉద్యోగ అవకాశాలకు అనుగుణంగా కావలసిన శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలని, లీడర్షిప్ క్వాలిటీస్‌ను అభివృద్ధి చేసుకుంటూ అన్ని అంశాలలో నైపుణ్యతను సాధించాలని సూచించారు. 62 విభాగాలలో పోటీలు నిర్వహించారు. వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్య కన్వీనర్లు పి భగత్, ఎం బి ఎస్ శ్రీకర్‌రెడ్డి, లకిరెడ్డి ప్రసాద్ రెడ్డి, లక్కిరెడ్డి హనిమిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బి రమేష్ రెడ్డి, పాల్గొన్నారు.

రైతులకు పాసు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-గంపలగూడెం: రాష్ట్రంలో ఏ రైతు సమస్యలతో సతమత మవ్వకూడదన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబు శ్రమిస్తున్నట్లు గంపలగూడెం మండల మాజీ ఎంపీపీ కోటగిరి శ్రీనివాసరావు తెలిపారు. గంపలగూడెంలో రైతులకు శనివారం పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తిరువూరు ఆర్డీవో కే.మాధురి, ఏఎంసీ ఛైర్మన్ రేగళ్ల లక్ష్మీ అనిత హాజరై పాసు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గంపలగూడెం తహశీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలి

ప్రజాశక్తి- నందిగామ : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలని నందిగామ అడిషనల్ జూడిషియల్ ఫస్ట్ క్లాస్ జడ్జి వందన పేర్కొన్నారు. నందిగామ పల్లగిరి మరియా నివాస్ స్కూల్‌లో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో "న్యాయవిజ్ఞాన సదస్సు శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా జడ్జి వందన పాల్గొని మాట్లాడుతూ పర్యావరణం పరిరక్షణ, మొక్కలు పెంపకం ద్వారా రేపటి తరానికి ఉజ్వలమైన భవిష్యత్తు, వెలుగులు అందించాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందని పేర్కొన్నారు. నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నంద్రు బాబు విద్యా సాగర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఎక్కిరాల హనుమంతరావు, గుర్రాల వెంకటరత్నం, యరగొర్ల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహాసభకు ఆహ్వానం

ప్రజాశక్తి-.జగ్గయ్యపేట: ఈ నెల 3 నుండి 5 వరకు గుంటూరులో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభలలో జగ్గయ్య పేటకు చెందిన ప్రముఖకవి, రచయిత, రాష్ట్ర ప్రభుత్వ విశిష్ట పురస్కార గ్రహీత సరికొండ నరసింహారాజుకు నిర్వాహకులు డా.గజల్ శ్రీనివాస్ నుండి ఆహ్వానం అందింది. ఈ నెల 5న నిర్వహించబడే శ్రీనాథ కవి సాహిత్య సదస్సుల వేదికపై వచన కవితా సాహిత్య సదస్సులో ప్రధానవక్తగా పాల్గొంటారు. "వచనకవిత్వం నవతరం" అంశం మీద సరికొండ ప్రసంగిస్తారు.

కంప్యూటర్ వితరణ

ప్రజాశక్తి - తిరువూరు : ఎ.కొండూరు మండలం కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్పోకెన్ ఇంగ్లీష్ ల్యాబ్ ఏర్పాటు చేయడానికి వీలుగా దాతలు కంప్యూటర్‌ను వితరణ చేయడం మంచి పరిణామం అని తిరువూరు డివైఈఓ డి.సాంబశివరావు అన్నారు. తెలంగాణకు చెందిన ప్రవాస భారతీయుడు వేమిరెడ్డి ఇంద్ర సేనారెడ్డి సౌజన్యంతో సమకూరిన కంప్యూటర్‌ను శనివారం ఆయన పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.శరత్ బాబు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఎం.రాంప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి మాసోత్సవాల కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం జాతీయ రహదారి అధికారుల ఆధ్వర్యంలో 37 వ జాతీయ రహదారి మాస ఉత్సవాలు శనివారం ఇబ్రహీంపట్నంలో ప్రారంభించారు. కార్యక్రమంలో సిఎంఓ రాజారావు, టోల్ మేనేజర్ జయప్రకాష్, సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్, ఐ బాలాజీ, శర్మ, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారిపై ప్రయాణించే వాహనదారుల వాహనాల భద్రతే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కూడా బాధ్యత వహించి వాహనాలు నడపాలి అని తెలిపారు. అనంతరం ఆటో డ్రైవర్లకు, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ కరపత్రాలు పంచిపెట్టారు.

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం రెడ్డిగూడెం మండల కేంద్రంలో డిపిఆర్టియు కేలండర్‌ను తహశీల్దార్ సుశీల దేవి, ఎంపీడీవో ప్రభాకర్ రావు, ఎంఇఓ పజ్జూరి రమేష్ శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్టియు నాయకులు శంకర్ కుమార్, లక్ష్మీపతి, నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు నాగమణి, శివ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని ప్రముఖ పెద్ద రామాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) శ్రీదేవి (అమ్మాజీ) దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య కళ్యాణ మహోత్సవం ఘనంగా సాగింది.

విద్యార్థులకు అల్పాహారం అందజేత

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని గౌరవరం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు లైన్స్ ఇంటర్నేషనల్ నందిగామ క్లబ్ వారు సాయంత్రం స్టడీ అవర్‌లో విద్యార్థులకు స్నాక్స్‌ను అందించేందుకు అంగీకారం తెలిపారు. దానిలో భాగంగా శనివారం జరిగిన కార్యక్రమంలో స్నాక్స్ ను పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు పి కవితకి క్లబ్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫాస్ట్ వైస్ చైర్మన్ డాక్టర్ యర్రంరెడ్డి గాంధీ, లైన్స్ క్లబ్ జోన్ చైర్మన్ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- నందిగామ ప్రతిభకు పదును పెడితే సాధించలేనిది ఏదీ లేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. నందిగామ పట్టణం అనాసాగరం గ్రామంలో శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు తేజ డివిఆర్ కళాశాల వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత స్టడీ మెటీరియల్‌ను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ స్టడీ మెటీరియల్‌ను ఉపయోగించుకొని మార్కులు సాధించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా విద్యకు ఆద్యురాలు సావిత్రి బాయి పూలే

• పలుచోట్ల ఘనంగా నివాళులు

గుడ్లవల్లేరు మండలంలో...

ప్రజాశక్తి-మొవ్వ: సావిత్రి బాయి పూలే 195వ జయంతి వేడుకలు మొవ్వ మండల యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం మొవ్వలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు శోభారాణి (కోసూరు.ఆర్), కూచిపూడి హై స్కూల్ ఉపాధ్యాయులు కే నిర్మల, ఎల్ ఎఫ్ ఎల్ మొవ్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కే కరుణశ్రీ, కూచిపూడి హై స్కూల్ హిందీ టీచర్ సుమిత లను పూలమాలలు వేసి దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. మొవ్వ మండల యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు కే బ్రహ్మం, ప్రధాన కార్యదర్శి ఎం రత్నగిరి రావు, మండల ఆడిటర్ పాగోలు రమేష్ బాబు, మండల కార్యదర్శులు బి జయరాం, ఏఎస్ఎస్ కుమార్, కే శివనాగరాజు, గోవిందరాజులు, లంకేశ్వరరావు, మహమ్మద్ అలీ హుస్సేన్, మహిళా ఉపాధ్యాయునులు నడకుదుటి నాగలక్ష్మి, వి శివ పార్వతి, కే నాగలక్ష్మి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** యుటిఎఫ్ గుడ్లవల్లేరు మండల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి ఎవి వరలక్ష్మి నేతృత్వంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు స్థానిక జడ్.పి.హెచ్. స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. అనంతరం మండలంలో మహిళా ఉపాధ్యాయినులైన కె. శాంతమ్మ , షేక్ మస్తాన్ , సిహెచ్ .సుజాత, జె. రజనీకుమారి లను దుశ్శాలువాలతో సన్మానించారు. మండల ఎంఈఓ 1 జి.జగన్మోహనరావు, డి. పద్మ అలాగే జిల్లా యుటిఎఫ్ కార్యదర్శి ఎ వి వరలక్ష్మి,మండల యుటిఎఫ్ అధ్యక్షులు డీవీఎం రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కె. వెంకట్రావు, గౌరవ అధ్యక్షులు ఎం.ఆరోగ్యం, జిల్లా కార్యవర్గ సభ్యులు కె రత్నం పాల్గొన్నారు.**ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ :** భారత దేశంలో మహిళా విద్యకు అద్యురాలు క్రాంతి జ్యోతి సావిత్రి భాయి పూలే అని పలువురు కొనియాడారు. శనివారం మచిలీపట్నం మండల పరిధిలోని కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రి భాయి పూలే 195 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముల్నివాసి సంఘ్ జిల్లా అధ్యక్షులు కోమటి శ్రీనివాసరావు మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వెంకటేశ్వ రమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సామాజిక ఉద్యమ నాయకులు మత్తే నాగరాజ్, బీసీ సంఘం నాయకులు బత్తిన నాగరాజు, డా బిఆర్. అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు గుమ్మడి కిరణ్, పాఠశాల విద్యా కమిటీ ఛైర్ పర్సన్ ఇందిరమ్మ తదితరులు ప్రసంగించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు కోమటి శ్రీనివాసరావు క్రీడా దుస్తులు బహుకరించారు.

అలాగే క్రాంతిజ్యోతి సావిత్రి భాయి పూలే 195 వ జయంతి వేడుకలను కృష్ణా విశ్వవిద్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యములో నిర్వహించిన కార్యక్రమంలో సావిత్రి భాయి పూలే చిత్రపటానికి ఉపకులపతి ఆచార్య కె రాంజీ, జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, ఎన్ ఎస్ ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం.శ్రావణి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల సెమినార్ హాల్లో జరిగిన ఈ వేడుకలో ప్రిన్సిపాల్ డాక్టర్. ఎస్ .జగన్ మోహనరావు మాట్లాడారు. అనంతరం కళాశాలలోని మహిళా అధ్యాపకులు ఐక్యు ఏసి కోఆర్డినేటర్ ఆర్. హిమాలినీదేవి, సీనియర్ అధ్యా పకురాలు జ్యోత్స్న ,రత్నలను సన్మానించారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీవీ నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా సావిత్రిబాయి చిత్రపటానికి శివాలయం మాజీ ఛైర్మన్ కుటుంబరాజుతో కలసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. సంస్థ అధ్యక్షుడు పసుపురెడ్డి స్వామి, ట్రెజరర్ చేవూరి రవిసుధాకర్, మహంకాళి పవనకుమార్, కొక్కిలిగడ్డ ప్రదీప్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డలోని టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు మండలి రామ్మోహన్రావు, పర్చూ రి. దుర్గాప్రసాద్, బండే. రాఘవ, కొల్లూరి ఇమ్మానుయేల్, దాసినేని శ్రీనివాసరావు, మెగావత్ గోపి పాల్గొన్నారు.

మొవ్వ మండలంలో...

ఉయ్యూరులో...

ప్రజాశక్తి - గుడివాడ : నియోజకవర్గం బిసి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రావులకొల్లు మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని పూలే దంపతులు విగ్రహాల వద్ద పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా వాకర్స్ గవర్నర్ లోయ ఈశ్వరవెంకటేశ్వరరావు, కార్యదర్శి గులిపల్లి ప్రభాకర్ రావు, గుడివాడ నియోజకవర్గ బీసీ చైతన్య సంక్షేమ సంఘం అధ్యక్షులు అగస్త్య ఆదివిష్ణు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బోయిన సోమశేఖర రావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పామర్రు :** స్థానిక అర్జీహెచ్చ్‌నగర్‌లోని ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాలలో ఘంటసాల-ఎన్టీఆర్ కళాపీఠం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎస్వీ రత్నాలు, విజయకుమారి, పూజితలకు సన్మాన కార్యక్రమం జరిగింది. కళాపీఠం అధ్యక్షులు కాటూరు వెంకట మురళీ కృష్ణ, అంక రవి,రామ్మోహనరావు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం:** మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా, బీఎస్సీ నర్సింగ్ ప్రథమ సంవత్సరంలో చదువుతున్న దాసరి ప్రహర్షిత, కె.రీష్మ అనే ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి మూడు, ఆరు వేల రూపాయలు అందించారు. వీరికి డి. రాజరత్నం, కర్రా వరప్రసాద్ లు మరో రెండు వేలు వితరణ గా అందించారు. సంస్థ కన్వీనర్ మడుపల్లి బాలకష్ణమూర్తి, అధ్యక్షుడు వీసం ప్రసాదరావు, కోశాధికారి పొట్లూరు రామకష్ణారావు, గౌరవ సలహాదారు ముక్కామల సుబ్బారావు, సభ్యుడు శ్రీకాకుళపు సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్ : మనుషులను సంతృప్తిపరిచే అన్నం పరబ్రహ్మ స్వరూపంగా పిలవబడుతుందని ఉమ్మడి కష్ణా జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ పేర్కొన్నారు. మచిలీపట్నం జగన్నాథపురంలో వేంచేసి ఉన్న సుభద్ర బలరామ సమేత జగన్నాథ స్వామి దేవాలయంలో శనివారం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని రామకృష్ణ ప్రారంభించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో విశిష్ట పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ పాలకమండలి చైర్మన్ గంపల దుర్గాభవాని సభ్యుల పర్యవేక్షణలో స్వామివారి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మరకాని పరబ్రహ్మం, లంకెశెట్టి బాలాజీ, కార్పొరేటర్ పినిశెట్టి ఛాయాదేవి,సమత కీర్తి, మండల పార్టీ అధ్యక్షులు గల్లా తిమోతి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిచ్చయ్య పాల్గొన్నారు.

648 మందికి ఉచిత పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య పరీక్షలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 648మంది రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలున్న రోగులకు డాక్టర్ సి.ఎల్. వెంకట్రావు, దంత సమస్యలకు ఏలూరు సెయింట్ జోసఫ్ డెంటల్ వైద్యులు, గుండె సంబంధ వ్యాధులకు విజయవాడ పీవీఆర్ మల్టీ స్పెషాల్టీ హాస్పటల్ వైద్యులు తమ వైద్య సేవలను రోగులకు అందించారు. అనంతరం ఉచిత మందులను పంపిణీ చేశారు. ఆదివారం విజయవాడ కామినేని హాస్పటల్, విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వారు వైద్య పరీక్షలు చేయనున్నట్లు వెంకట్రావు తెలిపారు.

జూడోలో ఒలింపిక్ మెడల్ సాధించాలి : బొండాడ

ప్రజాశక్తి-అవనిగడ్డ : జూడో క్రీడలో దివిసీమ క్రీడాకారులు ఒలంపిక్ మెడల్ సాధించాలని బొండాడ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ బొండాడ రాఘవేంద్రరావు సూచిం చారు. శనివారం అవనిగడ్డలోని ఎస్‌విఎల్ క్రాంతి కళాశాలలో కృష్ణాజిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాఘవేంద్రరావు మాట్లాడుతూ జూడో క్రీడలో శిక్షణ పొందితే ఆరోగ్యం, ఆత్మరక్షణతో పాటు, ఈ రంగం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న నియోజకవర్గ యువ నాయకులు, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ మాట్లాడుతూ తీర గ్రామం నుంచి స్వయంక షితో అంతర్జాతీయ స్థాయి జల క్రీడల్లో మెడల్స్ సాధిస్తున్న దివిసీమ బాలిక నాగిడి గాయత్రి స్ఫూర్తితో విద్యార్థులు జూడో శిక్షణ పొంది ఎదగాలని వెంకటరామ్ కోరారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలకు చెందిన జూడో క్రీడాకారులు జూడో విన్యాసాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.కళాశాలలో జూడో శిక్షణ కేంద్ర నిర్వహణకు అవసరమైన షీట్స్, దుస్తులను రాఘవేంద్రరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో జూడో అసోసియేషన్ రాష్ట్ర సీఈవో నామిశెట్టి వెంకట్, ఉపాధ్యక్షులు చింత శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ గమ్మిడి శ్రీనివాసరావు, కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు ప్రసంగించారు.

అవయవదానానికి అంగీకారం

ప్రజాశక్తి - గుడివాడ : వాసవి జాగతి క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో గౌతమ్ పబ్లిక్ స్కూల్ వద్ద నివాసముంటున్న మాజీ డిప్యూటీ తాసిల్దార్ పాతేపరపు వెంకట్రావు, ఆయన సతీమణి శ్రీలక్ష్మిలు మరణానంతరం అవయువ దానం చేయడానికి అంగీకారం తెలిపారు. శనివారం మంగళగిరి ఎయిమ్స్ హాస్పటల్‌కు అవయువాలు, ప్రసాద్ ఐ హాస్పిటల్‌కు నేత్రాలు దానం చేసేందుకు అంగీకార పత్రాలను క్లబ్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు చిన్నం గంగాధర్, క్లబ్ అధ్యక్షులు శేగు వెంకటప్రసాద్, డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ శేగు బబిత, డిస్ట్రిక్ కోఆర్డినేటర్ గాదె మోహన్‌బాబు, క్లబ్ కార్యదర్శి కంతేటి హరినాథ్‌బాబు, క్లబ్ సభ్యులు బచ్చు ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఎన్ఎస్ఎస్ సేవలు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్ఎస్-ఎస్ యూనిట్ - 1 విభాగం ఆధ్వర్యంలో మచిలీపట్నం బందరు కోటలో నిర్వహిస్తున్న సేవా శిబిరం రెండో రోజుకు చేరింది. శనివారం గ్రామంలో మొక్కలు నాటడంతో పాటు విద్య అవశ్యకతను తెలియచేస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి భాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. సావిత్రి భాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ అధికారిణి డా సల్మా, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి-ఉయ్యూరు : రహదారి నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యం చేరుకోవాలని రవాణాశాఖ ఉయ్యూరు యూనిట్ అధికారి సుబ్బారావు అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాలు పురస్కరించుకుని విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై శనివారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకం, రహదారి నిబంధనలు పాటించవలసిన అవసరాన్ని వివరించి అవగాహన కల్పించారు. వాహనం నడిపే వారు పాటించి వలసిన నిబం ధనలు తెలియజేసి తప్పనిసరాగా పాటించాలని సూచించారు. జాతీయ రహదారుల పై జరుగుతున్న ప్రమాదాలకు కారణాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆర్టీసీ డిపోలో జరిగిన రహదారి భద్రతా మాసోత్సవల్లో ఏఎంఐ ఆయేషాహుస్సేన్తో కలసి పాల్గొని బస్సులు, ఇతర వాహనాలు నడిపే వారు పాటించవలసిన నిబంధనలు సవివరంగా తెలియజేశారు. డిపో మేనేజర్ ప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

చలమలశెట్టి శ్రీకృష్ణకు నివాళి

నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్నం, చిలకలపూడికి చెందిన మాజీ కౌన్సిలర్ చలమలశెట్టి శ్రీకృష్ణ మృతికి శనివారం రాధారంగా మిత్ర మండలి అధ్యక్షులు బుల్లెట్ ధర్మారావు ఘన నివాళులర్పిం చారు. అమెరికాలో ఉంటున్న ఆయన ఏకైక కుమారుడు చలమలశెట్టి బాలాజీని చిలకలపూడిలోని వారి స్వగృహంలో కలిసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం తెలిపారు. మహి ళా కమిటీ సభ్యులు బడుగు ఉమాదేవి, మానేపల్లి మణి కుమారి, వన్నెంరెడ్డి కుమారి, కొక్కు ప్రభావతి, మోకా మల్లికా, విన్న కోట సుబ్బారావు, వల్లభుని శేఖర్, వన్నెంరెడ్డి ప్రసాదు పాల్గొని నివాళులర్పించారు.

విశాఖ తరలిన సిఐటియు శ్రేణులు

ప్రజాశక్తి-బంటుమిల్లి : విశాఖపట్నంలో జరిగే సిఐటి యు ఆల్ ఇండియా 18వ మహా సభలు చివరి రోజైనా ఆదివారం జరిగే ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేసేందుకు బంటిమిల్లి, కృత్తివెన్ను మండలం నుంచి ప్రజాసంఘాల నాయకులు శనివారం తరలివెళ్లారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి-కంకిపాడు : పెనమలూరు నియోజకవర్గం పోరంకి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజక వర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 73 మందికి సుమారు 34 లక్షల 98 వేల 658 రూపాయల చెక్కులను ఎమ్మెల్యే బోడే ప్రసాద్ శని వారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన 18 నెల కాలంలో 1249 మందికి 11 కోట్ల 33 లక్షలు రూపాయల మేర పేదవారికి సిఎంఆర్ఎప్ ద్వారా ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు.

పుస్తకావిష్కరణలు, చర్చాగోష్టులు

'మనుస్మృతిలో ఏముంది? పుస్తకాన్ని ఆవిష్కరించిన కోటేశ్వరరావు

పుస్తక మహోత్సవంలో విమలాదేవి సంస్మరణ సభ



ఉత్సాహంగా విజయవాడ పుస్తక మహోత్సవం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ 36వ పుస్తక మహోత్సవం రెండో రోజు శనివారం పలు కార్యక్రమాలు జరిగాయి. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న ఈమహోత్సవంలో మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ చైర్మన్ పి.మధు రచించిన 'మనుస్మృతిలో ఏముంది?', ఐఎఎస్ అధికారి అద్దంకి శ్రీధర్‌బాబు రచించిన 'మీరు శ్రీలు కావచ్చు', కత్తి పద్మారావు రచన 'సావిత్రి బాయి పూలే జీవిత చరిత్ర' పుస్తకాల ఆవిష్కరణలు జరిగాయి. అలాగే 'పాతికేళ్ల ప్రచురణ రంగం' అంశంపై చర్చా గోష్టి నిర్వహించారు. ముందుగా సూరపనేని విమాలాదేవి సంస్మరణ సభ జరిగింది. ఒరిస్సా గవర్నర్ కంభంపాటి హరిబాబు పుస్తక ప్రదర్శనను సందర్శించారు.

మనుస్మృతి భావజాలాన్ని వ్యతిరేకించాలి

ప్రముఖ కవి, విమర్శకులు కోయి కోటేశ్వరరావు

మనుస్మృతి భావజాలాన్ని వ్యతిరేకించాలని ప్రముఖ కవి, విమర్శకులు కోయి కోటేశ్వరరావు అన్నారు. సమాజంలో కుల వివక్ష, తదితర రుగ్మతలకు మనుస్మృతి భావజాలమే కారణమన్నారు. ఎంబి విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ చైర్మన్ పి.మధు రచించిన 'మనుస్మృతిలో ఏముంది?' పుస్తకాన్ని బివి.పట్టాభిరాం సాహిత్య వేదికపై కోటేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనుస్మృతి భావజాలం భారత రాజ్యాంగానికి వ్యతిరేకమని అన్నారు. ఎంబివికె కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ దేశ వెనుకబాటు తనానికి మనుస్మృతి భావజాలం కూడా ఒక కారణమన్నారు. పాత్రికేయులు వరప్రసాద్ మాట్లాడుతూ భారతీయ సమాజంపై మనుధర్మ శాస్త్ర ప్రభావమే ఎక్కువగా ఉందన్నారు. జాషువా సాంస్కృతిక వేదిక బాధ్యులు గుండు నారాయణరావు సభకు స్వాగతం పలకగా, ఎంబివికె బాధ్యులు క్రాంతి వందన సమర్పణ చేశారు.

ప్రచురణరంగం విస్తతిని అర్థంచేసుకోవాలి

ప్రచురణకర్తలంతా పుస్తక ప్రచురణ రంగంలో, సమాచార వినిమయంలో వస్తున్న ఆధునిక మార్పులను అందిపుచ్చుకోవాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. 'పాతికేళ్ల ప్రచురణ రంగం' అనే అంశంపై జరిగిన చర్చాగోష్టిలో ప్రముఖ పాత్రికేయులు రెంటాల జయదేవ్ మాట్లాడుతూ ఇ-బుక్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ మార్గాలను కూడా గుర్తించి దానికి తగినట్లు తమ ఉత్పత్తి, మార్కెటింగ్ విధానాలను మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి పల్లవి పబ్లికేషన్స్‌కు చెందిన ఎస్.వెంకటనారాయణ అధ్యక్షత వహించారు. ఎమెస్కో బుక్ సెంటర్ అధినేత దూపాటి విజయకుమార్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజరు మనోహర్ నాయుడు, ప్రజాశక్తి బుక్ హౌస్ మేనేజరు కె.లక్ష్మయ్య పాల్గొన్నారు.

'మీరు శ్రీలు కావచ్చు' ఆవిష్కరణ

ఐఎఎస్ అధికారి అద్దంకి శ్రీధర్ బాబు రచించిన 'మీరు శ్రీలు కావచ్చు' పుస్తకాన్ని అవనిగడ్డ ఎంఎల్ఎ, మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. పుస్తక సంపాదకులు వల్లీశ్వర్, ప్రచురణకర్త దూపాటి విజయకుమార్, పుస్తక రచయిత శ్రీధర్ బాబు పాల్గొన్నారు.

కత్తి పద్మారావు రచన 'సావిత్రి బాయి పూలే' ఆవిష్కరణ

కత్తి పద్మారావు రచించిన 'సావిత్రి బాయి పూలే జీవిత చరిత్ర' పుస్తకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ కోయి కోటేశ్వరరావు, ఎన్.జె.విద్యాసాగర్, శిఖామణి, గద్దర్ ఫౌండేషన్ అధ్యక్షులు, గద్దర్ కుమారుడు సూర్యకిరణ్, సరితా సూర్యకిరణ్, గడ్డం విజయకుమార్ తదితరులు మాట్లాడారు.

విమలాదేవి సంస్మరణ సభ

పుస్తక మహోత్సవ సంఘానికి భూరి విరాళాలిచ్చిన సూరపనేని విమాలాదేవి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభలో ఆమె కుమార్తె పద్మజ, పుస్తక మహోత్సవ సంఘం అధ్యక్షులు టి.మనోహర్ నాయుడు, కార్యదర్శి కె.లక్ష్మయ్య, ముప్పాళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శనను సందర్శించిన గవర్నర్ కంభంపాటి

36వ పుస్తక మహోత్సవాన్ని శనివారం ఒడిసా గవర్నర్ కంభంపాటి హరిబాబు సందర్శించారు. స్టేడియంలో ఏర్పాటు చేసిన వివిధ పుస్తక స్టాళ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. ప్రచురణకర్తలు, రచయితలతో ముచ్చటించి పుస్తక విశేషాలను అడిగి తెలుసుకున్నారు.

పుస్తక మహోత్సవానికి హాజరైన జనం

పుస్తక మహోత్సవంలో స్టాళ్లను పరిశీలిస్తున్న ఒడిసా గవర్నర్

'మీరు శ్రీలు కావచ్చు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బుద్ధప్రసాద్

సైబర్ నేరాల నియంత్రణకు అవగాహన కల్పించాలి : సిపి

ప్రజాశక్తి-విజయవాడ : సైబర్ నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని పోలీసు కమిషనర్ ఎస్‌వి రాజశేఖర్‌బాబు అన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు 'సైబర్ సురక్షా" కార్యక్రమంలో భాగంగా నగర పోలీసు కమిషనర్ వారి కార్యలయంలో పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆధ్వర్యంలో నగరంలోని ఆయా బాంకుల జిఎం, ఏజిఎం స్థాయి ఉన్నతాధికారులతో శనివారం సమావేశం నిర్వహించి, డిజిటల్ అరెస్ట్, సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ జిల్లాలోని పోలీసు కమీషనరేట్ పరిధిలో సైబర్ నేరాలపై వినూత్న కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఒక చైతన్యం తీసుకువచ్చి, సురక్ష అనే పేరుతో అందరి సహకారంతో పోలీస్ కమీషనరేట్ పరిధిలో 10000 సి.సి. కెమెరాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సి.సి. కెమెరాల వలన చాలా కీలకమైన కేసులను చెందించామన్నారు. అస్త్రం అనే టెక్నాలజీని ఉపయోగించి ట్రాఫిక్‌లో కూడా చాలా వినూత్నమైన మార్పులను తీసుకురావడం జరిగిందన్నారు. నేడు సైబర్ క్రైం పెను సవాల్‌గా మారిందని, దీనిపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరముందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డి.సి.పి. కృష్ణ ప్రసన్న, ఏ.సి.పి రాజశేఖర్, సైబర్ క్రైమ్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

శ్వాసకోశ వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : "శ్వాసకోశ వ్యాధులను నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరం. అని, ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స తీసుకోవడం ఎంతో అవసరం. ప్రతి ఒక్కరూ శ్వాసకోశ వ్యాధులపై సరైన అవగాహన కలిగి ఉంటే వాటిని తేలికగా నివారించవచ్చు" అని ప్రముఖ శ్వాసకోశ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ శివ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. బెంజ్ సర్కిల్ వద్ద గల. వాసవ్యా నర్సింగ్ హోమ్‌లో డాక్టర్ సమరం అధ్యక్షతన శనివారం జరిగిన ఆరోగ్య సదస్సులో ఆయన "శ్వాసకోశ వ్యాధులు " అంశంపై ప్రసంగించారు. శ్వాసకోశ వ్యాధులు రాకుండా నివారించాలంటే పొగ త్రాగడం మానేయడం, కాలుష్యం ఎక్కువుగా ఉన్నచోట మాస్క్ తప్పనిసరిగా వాడటం, టీకాలు వేసుకోవడం, పరిశు భ్రమైన వాతావరణంలో నివసించడం, సమతుల ఆహారం తీసుకోవడం, రోజూ వ్యాయామం చేయడం, లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించడం ఎంతో అవసరం అన్నారు. సదస్సులో పాల్గొన్న అనేకమంది పలు ప్రశ్నలడిగి సందేహ నివత్తి చేసుకున్నారు.

మత్స్య సంపదపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : భవానీ పురంలోని భవానీ ఘాట్ నుంచి పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి రోహింగ్యా చేప పిల్లలను కృష్ణా నదిలోకి వదిలారు. శనివారం మత్స్య శాఖ ఆధ్వర్యంలో దాదాపు 15 లక్షల చేప పిల్లలను నదిలో వదిలే కార్యక్రమాన్ని సుజనా చౌదరి లాంఛనంగా ప్రారంభించారు. చేప పిల్లలను నదిలోకి వదలడం వల్ల మత్స్యకారులకు జీవనోపాధి తో పాటు ప్రభుత్వానికి సైతం పరోక్షంగా ఉపయోగకరంగా ఉంటుదని సుజనా చౌదరి పేర్కొన్నారు.కార్యక్రమంలో మత్స్య శాఖ అధికారులు, బిజెపి జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ నాయకుడు అబ్దుల్ ఖాదర్, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

జొన్న సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు

కెవికె గరికపాడు ప్రోగ్రాం కోఆర్డినేటర్ రవికిషోర్

విజయవాడ రూరల్ : చిరుధాన్య పంటలలో ముఖ్యమైన పంట జొన్న అని, అధిక పోషక విలువలు కలిగి ఉండటంతో జొన్న సాగు, వినియోగానికి ఆదరణ పెరుగుతోందని కెవికె గరికపాడు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. రవికిషోర్ తెలిపారు. జొన్న సాగులో రైతులు ఆధునిక మెళకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఆయన సూచించారు. శనివారం విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో కెవికె గరికపాడు, ఆత్మ మరియు వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జొన్న పంటపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం. రవికిషోర్, సేద్య విభాగ శాస్త్రవేత్త డాక్టర్ పి.ఎన్. శివప్రసాద్ జొన్న పంట యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. జొన్న సాగులో ఎరువుల యాజమాన్యం, చీడపీడల నియంత్రణ ఎంతో కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ డివైఎఫ్‌ఐ వినాయక ఉత్సవాల కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి మృతి

ప్రజాశక్తి-విజయవాడ : రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం కృష్ణలంక 22వ డివిజన్ డివైఎఫ్‌ఐ వినాయక ఉత్సవాల కమిటీ సభ్యులు కసిరెడ్డి వెంకట శివకృష్ణారెడ్డి మృతి చెందాడు. ఇతని మృతి పట్ల డివైఎఫ్‌ఐ నాయకులు సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. డివైఎఫ్‌ఐ పూర్వ నాయకులు బత్తుల చిన్నారావు,. వాజా శ్రీనివాసరావు, ఇతర నాయకులు కృష్ణారెడ్డి మృతదేహంపై పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు.